




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక






ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 145 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం - 16 జులై - 2026 | వెల రూ. 5 /-

## కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ.. కీలక విజ్ఞప్తి



- ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్రమంత్రితో కేటీఆర్ భేటీ
- కేంద్ర, రాష్ట్రాలు చెరో రూ.250 కోట్లు ఇస్తే ప్లాంట్ ప్రారంభించవచ్చని ప్రతిపాదన
- ప్లాంట్ తెరిస్తే 6,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరణ
- కేటీఆర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి
- హామీ నెరవేర్చకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించిన కేటీఆర్

»2

## తెలంగాణలో వింత వాతావరణం..

నేడు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!


»2

- తెలంగాణలో జులై 22 వరకు పొడి వాతావరణం
- 5 జిల్లాల్లో వేడి, ఉక్కపోత ఉంటుందని ఐఎండీ హెచ్చరిక
- రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాల్లో వర్షాభావం, హన్మకొండలో 65 శాతం లోటు నమోదు
- హైదరాబాద్‌లో 36 డిగ్రీల వరకు చేరనున్న గరిష్ఠ ఉష్ణోగ్రత



## నేరాలకు అడ్డాగా మారుతున్న ఇళ్లు..

ఇంటి ఓనర్లకు హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక!

- అద్దెదారుల పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి
- నిబంధనలు మీరితే జరిమానాతో పాటు ఆస్తుల సీజ్
- హాక్ ఐ యాప్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు
- నగరంలో నేరాల నియంత్రణ కోసమే ఈ చర్యలు

»2

### పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై

# తొందర్లోనే శుభవార్త

- 90 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు సాధిస్తామని వెల్లడి
- మహబూబ్‌నగర్‌లో అమర రాజా తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పరిశ్రమల్లో స్థానికులకే అత్యధిక ఉద్యోగాలు ఇవ్వాలని సూచన
- పాలమూరును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని హామీ




**నేటి శుభోదయ, మహబూబ్‌నగర్ :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటీపల్లిలో 'అమర రాజా గ్రూప్' నెలకొల్పిన తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒ ప్పించి, అవసరమైన అనుమతులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. అదేవిధంగా, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కృష్ణా బేసిన్ పరిధిలోని దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన కోసం భూములిచ్చిన రైతులకు తగిన న్యాయం జరగాలని, అలాగే స్థానిక యువతకే గరిష్ఠ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు, అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని, ఈ తరుణంలో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం ముదావాహమని పేర్కొన్నారు. స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తున్న అమర రాజా సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించామని, పారిశ్రామిక విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడుతూ అమరరాజా గ్రూప్ దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది. తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు. తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు. సవరించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

### రేవంత్ పాలనలో హైదరాబాద్ ఐటీ రంగం దిగజారుతోంది..

## కాగ్నిజెంట్ విశాఖకు వెళుతోంది - దాసోజు శ్రవణ్

- రేవంత్ ఐటీ పరిశ్రమను చంపేసే పని చేస్తున్నారన్న శ్రవణ్
- 7 వేల ఉద్యోగాలు తగ్గాయని భట్టి అసెంబ్లీలోనే చెప్పారని వ్యాఖ్య
- ఇప్పటికే లక్షా 20 వేల ఉద్యోగాలు పోయాయన్న శ్రవణ్

»2



## పోక్సో నిందితుడికి అతడి వల్లే బెయిల్.. ఇదేనా మహిళల రక్షణ? - ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



- రాష్ట్రంలో ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడన్న ప్రవీణ్ కుమార్
- షాబాద్ పోక్సో నిందితుడికి ముందస్తు బెయిల్ వచ్చేంత వరకు కాలయాపన చేశారని మండిపాటు
- బాధిత కుటుంబాలను ఓదార్చడానికి వెళుతున్న తమను అరెస్ట్ చేశారని విమర్శ

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ దారుణ ఉదంతంపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రభుత్వం, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఆరోపించారు. మే 16వ తేదీనే బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని... నిందితుడు ఎవరో, ఏం చేశాడో వివరించినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ తెచ్చుకునే వరకు కూడా అతన్ని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు.

»2

### 50 నామినేటెడ్ పదవులు

## ఈ నెలలోనే భర్తీ

: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి

»2



## బస్ టికెట్‌తో పాటే ఇంటికి ఆటో

- టీజీఆర్టీసీ సరికొత్త సదుపాయం


»2

## పారాక్వాట్ గడ్డిమందుపై బ్యాన్

- దేశవ్యాప్తంగా పారాక్వాట్ గడ్డిమందుపై సంపూర్ణ నిషేధం.
- కీటకనాశన చట్టం 1968 ప్రకారం రసాయన తయారీ, అమ్మకాల నిలిపివేత.
- నిర్దిష్ట విరుగుడు లేని పారాక్వాట్ వల్ల ఊపిరితిత్తులు, అంతర్గత అవయవాలకు తీవ్ర నష్టం.
- గతంలో రాష్ట్రాలకే పరిమితమైన ఆంక్షలు, ఇప్పుడు నిపుణుల కమిటీ సిఫారసులతో దేశవ్యాప్తంగా అమలు.

»2



# తెలంగాణలో వింత వాతావరణం
## నేడు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాకాలంలోనూ పొడి వాతావరణం కొనసాగుతోంది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, రేపు (జులై 16) ఐదు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. బుధవారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం తీవ్రమైన ఉక్కపోత ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జులై 22 వరకు పొడి వాతావరణమే కొనసాగుతుందని, తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క హన్మకొండ జిల్లాలోనే ఈ జులై నెలలో ఇప్పటివరకు 65 శాతం వర్షపాతం లోటు నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, ఇటీవల నల్గొండలో 38.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్నప్పటికీ, రుతుపవన ద్రోణి రాష్ట్రంలో వర్షాలకు అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

# నేరాలకు అడ్డాగా మారుతున్న ఇళ్లు..
## ఇంటి ఓనర్లకు హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక!

**మొదటిపేజీ తరువాయి..** భాగ్యనగరంలోని ఇంటి యజమానులకు పోలీసు యంత్రాంగం కీలక హెచ్చరికలు జారీ చేసింది. నివాసాలను అద్దెకు ఇచ్చేటప్పుడు ఆ వివరాలను తప్పనిసరిగా పోలీసులకు సమర్పించాలని, అద్దెదారుల పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని, అవసరమైతే ఆస్తులను సైతం సీజ్ చేస్తామని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు హెచ్చరించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రెసిడెన్షియల్ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, లాడ్జీలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అద్దె ఇళ్లే కేంద్రంగా డ్రగ్స్ సరఫరా, జూదం, వ్యభిచారం, సైబర్ మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు, అనుమానితులు నివాస ప్రాంతాల్లో తలదాచుకోకుండా నిరోధించేందుకే ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటి యజమానుల సౌలభ్యం కోసం 'హాక్ ఐ' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ యాప్ ద్వారా అద్దెదారుల వ్యక్తిగత వివరాలు, గుర్తింపు కార్డులు, ఫొటోలను నేరుగా అప్‌లోడ్ చేయవచ్చు. యాప్ వినియోగించని వారు స్థానిక పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు ఫారాలు తీసుకుని, అవసరమైన ధ్రువపత్రాలతో సహా సమర్పించాలని సూచించారు. కేవలం బ్రోకర్లు చెప్పే మాటలను నమ్మవద్దని, కమీషన్ల కోసం వారు కొన్నిసార్లు తప్పుడు సమాచారం ఇచ్చే అవకాశం ఉంటుందని యజమానులను పోలీసులు హెచ్చరించారు. భద్రత దృష్ట్యా ఇళ్ల ప్రవేశ ద్వారాలు, కారిడార్లు, మెట్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమమని సలహా ఇచ్చారు. నేరాలను అరికట్టి, సమాజ భద్రతను మెరుగుపరిచేందుకు యజమానులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# రేవంత్ పాలనలో హైదరాబాద్ ఐటీ రంగం దిగజారుతోంది..
## కాగ్నిజెంట్ విశాఖకు వెళుతోంది - దాసోజు శ్రవణ్




**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ అనగానే ఒకప్పుడు చార్మినార్ గుర్తొచ్చేదని... ఇప్పుడు ఐటీ, ఫార్మా పరిశ్రమలకు హైదరాబాద్ పేరుగాంచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, వేగంగా పురోగమిస్తున్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా ఉన్న పరిస్థితి నుంచి రేవంత్ పాలనలో దిగజారే దాకా వెళుతోందన్నారు. 2014లో 50 వేల కోట్ల రూపాయలు ఉన్న ఐటీ ఎగుమతులను 2023లో 2 లక్షల కోట్లు దాటేలా కేటీఆర్ శ్రమించారు. 3 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయి నుంచి కేటీఆర్ 9 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయికి హైదరాబాద్‌ను మార్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అందరూ సిగ్గుపడేలా పరిస్థితి మారిందన్నారు. రేవంత్ రెడ్డి 18 గంటలు కష్టపడి ఐటీ పరిశ్రమను చంపేసే పని చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు కాగ్నిజెంట్ రాంరాం అన్నదని... 15 వేల నుంచి 20 వేల ఉద్యోగాలు కల్పించే కాగ్నిజెంట్ విశాఖకు తరలుతోందని ఆరోపించారు. కాగ్నిజెంట్‌ను రెండు చోట్ల విస్తరించేలా గతంలో రెండు ఎంఓయూలు కుదిరాయి. అయినా కాగ్నిజెంట్ హైదరాబాద్ నుంచి విశాఖకు మారుతోందన్నారు. 7 వేల ఐటీ ఉద్యోగాలు తగ్గాయని భట్టి విక్రమార్క అసెంబ్లీలోనే చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఉద్యోగాలను మింగేస్తున్నారని, కేటీఆర్ సగటున 60 వేల ఉద్యోగాలు పెంచితే రేవంత్ రెడ్డి 6 వేల ఉద్యోగాలు తగ్గిస్తున్నారన్నారు. ఇప్పటికే లక్షా 20 వేల ఉద్యోగాలు కోల్పోయామని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ఏపీ సీఎంకు చప్రాసీనా అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఐటీ మీద ఆధారపడుతున్న వారి పరిస్థితి ఏమిటని ఆరోపించారు. దావోస్ పోయి రేవంత్ రెడ్డి పెద్దపెద్ద మాటలు చెప్పారని... ఆయన తెచ్చిన పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ.. కీలక విజ్ఞప్తి

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలోని ఆదిలాబాద్‌లో గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తక్షణమే పునరుద్ధరించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమైన ఆ యన, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కేటీఆర్‌తో పాటు సీసీఐ సాధన సమితి ప్రతినిధులు, రైతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు రామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని కలిసింది. ఈ ప్లాంట్ పునరుద్ధరణ ద్వారా వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతం యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ వివరించారు. దాదాపు 2,300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్‌కు ఏటా 4 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, సుమారు 100 ఏళ్లకు సరిపడా సున్నపురాయి నిల్వలు అక్కడ ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తి నిరుపయోగంగా మారి తుప్పు పట్టకుండా కాపాడాలని ఆయన కోరారు. సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడితో అక్కడ అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చని ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.250 కోట్ల చొప్పున 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' అందిస్తే, ప్లాంట్ కార్యకలాపాలను పునఃప్రారంభించవచ్చని కేటీఆర్ సూచించారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్ విన్నపంపై కేంద్రమంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు అందించిన తరహాలోనే ఇక్కడి ప్లాంట్‌కు కూడా మద్దతు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫ్యాక్టరీని తెరిపించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# పోక్సో నిందితుడికి అతడి వల్లే బెయిల్..
## ఇదేనా మహిళల రక్షణ? - ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**మొదటిపేజీ తరువాయి..** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ దారుణ ఉదంతంపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రభుత్వం, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఆరోపించారు. మే 16వ తేదీనే బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని... నిందితుడు ఎవరో, ఏం చేశాడో వివరించినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ తెచ్చుకునే వరకు కూడా అతన్ని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఎల్‌బీ నగర్ పోక్సో కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను తాను పరిశీలించానని, అందులో చనిపోయిన బాలిక సోదరుడు బెయిల్‌ను వ్యతిరేకించినట్లు ఉందని ప్రవీణ్ కుమార్ చెప్పారు. కానీ, అసలు ఆ బాలికకు అన్నే లేదని, కేవలం ఒక అక్క మాత్రమే ఉందని పేర్కొంటూ.. లేని అన్న వచ్చి బెయిల్ వద్దని ఎలా చెబుతాడని ప్రశ్నించారు. పోక్సో రూల్స్ 2020 ప్రకారం నిందితుడు బెయిల్‌కు దరఖాస్తు చేసుకుంటే బాధితులకు నోటీసు ఇవ్వాలి. కానీ ఇక్కడ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న వ్యక్తి కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ బిక్షపతి గౌడ్ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడి వల్లే షాబాద్ పోక్సో నిందితుడు రాజ్ కుమార్‌కు బెయిల్ వచ్చిందని, ఇలాంటి వారికి పీపీ పోస్టులు ఇస్తే మహిళలకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చడానికి వెళుతున్న తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని, ఇదే ఉత్సాహం నిందితులను అరెస్ట్ చేయడంలో ఎందుకు చూపించడం లేదని నిలదీశారు.

# 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ
## - టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగో లేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

# బస్ టికెట్‌తో పాటే ఇంటికి ఆటో
## - టీజీఆర్టీసీ సరికొత్త సదుపాయం



**మొదటిపేజీ తరువాయి..** బస్ టికెట్‌తో పాటే ఇంటికి ఆటో టీజీఆర్టీసీ సరికొత్త సదుపాయం అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేసింది. ప్రైవేటు ట్రావెల్స్ పోటీని ఎదుర్కొనేందుకు తెలంగాణ ఆర్టీసీ హైదరాబాద్‌లో 'కాంబో' ఈ–ఆటో సర్వీసును ప్రవేశపెట్టనుంది. ఆర్టీసీ ప్రత్యేక యాప్ ద్వారా బస్ టికెట్ బుక్ చేసుకునేటప్పుడే, ఇంటి నుండి బస్టాండుకు లేదా బస్టాండు నుండి ఇంటికి వెళ్లేందుకు ఎలక్ట్రిక్ ఆటోను కూడా కలిపి బుక్ చేసుకోవచ్చు. దీనికోసం ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ కాంబో సర్వీసు ద్వారా బస్ టికెట్, ఆటో ఛార్జీ రెండూ కలిపి ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఈ సేవలు హైదరాబాద్ సిటీలో అందుబాటులోకి రానున్నాయి.

# పారాక్వాట్ గడ్డిమందుపై బ్యాన్

**మొదటిపేజీ తరువాయి..** భారత రైతాంగానికి శాపంగా మారిన పారాక్వాట్ గడ్డిమందుపై కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. విషత్యులమైన రసాయనం అమ్మకాలు నిలిపివేస్తూ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. జులై 14 నుంచే ఈ నిషేధం అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఇప్పటికే 70కి పైగా దేశాల్లో పారాక్వాట్‌ను నిషేధించగా మనదేశంలో మాత్రం ఈ గడ్డిమందు అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ రసాయనం దుష్పరిణామాలపై తీవ్ర స్థాయిలో ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యులు, వ్యవసాయ పరిశోధకులు పదేపదే చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో కేంద్రం ఎట్టకేలకు పారాక్వాట్‌పై నిషేధం విధించింది. దేశ వ్యాప్తంగా నిషేధం అమలులోకి వస్తుందని కేంద్రం వెల్లడించింది.కీటకనాశన చట్టం 1968, సెక్షన్ 27 ప్రకారం పారాక్వాట్ దిగుమతి, తయారీ, రవాణా, పంపిణీపై పూర్తి స్థాయిలో నిషేధం వర్తిస్తుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. అదే సమయంలో సదరు కంపెనీకి అభ్యంతరాలు, సూచనలు తెలియజేయడానికి 30 రోజుల సమయం ఇచ్చింది. జూలై 13 నుంచి ఆగస్టు 13లోపు పారాక్వాట్ ఉత్పత్తి సంస్థ తమ స్పందన తెలియజేయాల్సి ఉంది. పారాక్వాట్ గడ్డిమందు కారణంగా దేశవ్యాప్తంగా 6 వేలమందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని రికార్డులు చెబుతున్నాయి. పలువురు ప్రముఖులు, ఫౌండేషన్లు సైతం పారాక్వాట్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశాయి. జరుగుతున్న నష్టాన్ని వివరించాయి.పారాక్వాట్‌కు నిర్దిష్ట విరుగుడు లేనందున వైద్యులు దీనిని అత్యంత ప్రాణాంతకమైన వ్యవసాయ రసాయనాలలో ఒకటిగా భావిస్తున్నారు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత పారాక్వాట్ నేరుగా ఊపిరితిత్తులను




దెబ్బతీస్తుంది. ఇది తరచుగా కోలుకోలేని ఫైబ్రోసిస్కు కారణమవుతుంది. మూత్రపిండాలు, కాలేయం, చర్మం, కళ్ళను కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. చికిత్స అనేది రోగనివారకంగా కాకుండా ఎక్కువగా సహాయకారిగా ఉంటుంది కాబట్టి, విషప్రయోగం అనూహ్యంగా అధిక మరణాల రేటును కలిగి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వ్యవసాయ కార్మికులను కూడా పారాక్వాట్ లక్ష్యంగా చేసుకుంటుంది.

### ఇదే మొదటిసారి కాదు

పారాక్వాట్ మీద నిషేధం విధించడం ఇదే మొదటిసారి కాదు. కేరళ, ఆంధ్రప్రదేశ్ సహా అనేక రాష్ట్రాలు ఇంతకుముందు దీని వాడకాన్ని పరిమితం చేశాయి. అయితే ఇతర రాష్ట్రాల్లో చట్టపరమైన సవాళ్లు, సాంకేతిక అడ్డంకులను ఎదురయ్యాయి. కేంద్రం స్వయంగా నిపుణుల కమిటీలు, నియంత్రణ సమీక్షల ద్వారా హెర్బిసైడ్లను పదేపదే పరిశీలించింది. ఇప్పుడు, ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం, రిజిస్ట్రేషన్ కమిటీ సిఫారసులను అనుసరించి, వ్యవసాయ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నిషేధం కోసం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. మునుపటి రాష్ట్ర స్థాయి ఆంక్షల మాదిరిగా కాకుండా తాజా నిషేధం దేశవ్యాప్తంగా వర్తిస్తుంది.

## పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ అవగాహన సదస్సు



**నిజామాబాద్, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ మరియు సిరికొండ గ్రామాలలో నేడు జిల్లా ఉద్యాన & పట్టుపరిశ్రమ శాఖ మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించబడింది. వ్యవసాయంలో పంటల వైవిధ్యీకరణకు ఆయిల్ పామ్ సాగు ఒక మంచి ప్రత్యామ్నాయమని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల హార్టికల్చర్ ఆఫీసర్ జిట్టా రోహిత్ గారు, మండల వ్యవసాయ అధికారి (MAO) నర్సయ్య గారు,MRO గారు, సంబంధిత ఉద్యాన విస్తరణ అధికారి విద్యాసాగర్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ సర్పంచ్ గారు మరియు ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు గారు పాల్గొన్నారు.సదస్సులో ఆయిల్ పామ్ పంట సాగు విధానం, భూసిద్ధం, నాటే విధానం, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, చీడపీడలు మరియు వ్యాధుల నివారణ, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే సబ్సిడీలు, కంపెనీ ద్వారా అందించబడే సాంకేతిక సహాయం మరియు మార్కెటింగ్ సౌకర్యాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన పంట అని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖను సంప్రదించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. పంట సాగు చేసి అదర్శంగా నిలుస్తున్న రైతులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు అలాగే రైతుల ను సన్మానించారు

## వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు.. పట్టించుకోని నిర్వహణ సిబ్బంది!

**నిజామాబాద్, నేటి శుభోదయ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ భాగీరథ' తాగునీటి పథకం ఆశయానికి క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం శాపంగా మారుతోంది. సిరికొండ మండలం సిరికొండ నుండి కామరెడ్డి వెళ్లే ప్రధాన రహదారి లో హుస్సేన్ నగర్ శివారు పరిధిలో మిషన్ భాగీరథ ప్రధాన పైప్‌లైన్ జాయింట్లు, వాల్వ్ ల వద్ద గత కొన్ని రోజులుగా భారీగా నీరు లీక్ అవుతూ వృథాగా పోతోంది.పైప్‌లైన్ కనెక్టివిటీ సరిగ్గా లేకపోవడం, బోల్టులు తుప్పుపట్టి నీరు నిరంతరం వృథాగా కారిపోతుండటంతో నీళ్లు వృధా గా పోతున్నాయి ఒకవైపు ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే, ఇలా జాయింట్ల వద్ద లీకేజీల వల్ల వేల లీటర్ల శుద్ధి చేసిన నీరు వృథాగా డ్రెయినేజీల పాలు కావడమే కాకుండా, పంట పొలాల్లోకి చేరుతోంది.సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం:ఈ లీకేజీ సమస్యపై స్థానిక మిషన్ భాగీరథ మెయింటెనెన్స్ (నిర్వహణ) సిబ్బంది, సంబంధిత అధికారులు ఇదే రహదారి పై రోజు వెళ్తు ఉంటారు వారికి కనపడలేదా అని స్థానికులు అచ్చర్యం వ్యక్తం చేస్తున్నారు లీకేజీలను అరికట్టడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా మిషన్ భాగీరథ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని స్థానికులు కోరుతున్నారు. యుద్ధప్రాతిపదికన లీకేజీలను అరికట్టి, నీటి వృథాను అడ్డుకోవాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## వార్షిక తనిఖీలలో భాగంగా బి.డి.ల్ భానూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ





**సంగారెడ్డి, నేటి శుభోదయ :** వార్షిక తనిఖీలలో భాగంగా ఈ రోజు (15.07.2026) జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బి.డి.ల్ భానూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బి.డి.ల్ భానూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పటాన్ చెర్వు డీఎస్పీ తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేస్తూ, సర్వీస్ కాలమంతా ఉపయోగపడే ఈ కిట్ ఆర్టికల్ జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న, స్వాధీనపరుచుకున్న లేదా కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని అన్నారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు అండగా నిలవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ కోసం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కలిగి శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను పరిశీలిస్తూ, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కు భానూర్ పరిసర ప్రాంతం అత్యంత సమీపంలో ఉండటంతో, ఈ ప్రాంతంలో ఐటీ ఉద్యోగులు అధిక సంఖ్యలో నివాసం ఉండే అవకాశం ఉందని, వారి రాకపోకల కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు తరచూ ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తూ, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని సూచించారు.అదేవిధంగా, ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో వలస కార్మికులు (మైగ్రెంట్ లేబర్) ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు కూడా అధికంగా ఉంటాయని తెలిపారు. ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు-రాత్రి బీట్ విధుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు.అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుండి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు సూచించడం జరిగింది. విధుల పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వెహికల్ నడిపేటప్పుడు, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ గారి వెంట పటాన్ చెర్వు డీఎస్పీ ప్రభాకర్, బి.డి.ల్ భానూర్ ఎస్.హెచ్.ఓ విజయ్ కృష్ణ, ఎస్ఐ నాగలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



**సత్తుపల్లి, నేటి శుభోదయ :** సత్తుపల్లి పట్టణ కేంద్రంలో గల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం ఉచిత నేత్ర పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. శరత్ మాక్స్ విజన్ సంస్థ పలువురికి పరీక్షలు నిర్వహించింది.శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఖమ్మం తీసుకుని వెళతామని శరత్ మాక్స్ విజన్ సిబ్బంది విక్రమ్ సింగ్,అనిల్, కరుణ,లెనిన్ తెలిపారు. ఈ శిబరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఏ.యస్.ప్రకాశ రావు, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, బూరుగు దాసు, యోగానందం,నర్సయ్య పాల్గొన్నారు.

## చెర్లగోపులారంలో రూ.8 లక్షల సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** కొండాపూర్ మండలం చెర్లగోపులారం గ్రామంలో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించామని పేర్కొన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలు ప్రస్తుత పరిస్థితులను గమనిస్తున్నారని, మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి , పార్టీ అధ్యక్షులు మ్యాకం విఠల్ , కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, మల్ల గౌడ్ , శ్రీధర్ రెడ్డి, రామచంద్రయ్య , ప్రేమ నందం , ప్రకాష్ , అమరేందర్ రెడ్డి , కృష్ణ మూర్తి , స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి పలు కుటుంబలకు పరామర్శ ప్రగాఢ సానుభూతి



**నిజామాబాద్, నేటి శుభోదయ :** ఇటీవల అనారోగ్యంతో మరణించిన సర్పంచ్ తండా భీమా నాయక్ గారి కుటుంబ సభ్యులను★, వారి కుమారులు లింబ నాయక్, రాంజీ నాయక్★ లను కలిసి పరామర్శించి, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఓదార్పు పలికారు.అలాగే కొండాపూర్ మాజీ సర్పంచ్, గౌసుద్దీన్ గారి తల్లి ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకొని ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం ఇటీవల మృతి చెందిన శివయ్య గారి★ కుటుంబాన్ని కూడా పరామర్శించి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అసల మహేందర్ గారు, కొండాపూర్ సర్పంచ్ నేరేటి మానస శ్రీధర్ గారు, కొండాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నల్ల బుచ్చన్న గారు, గడ్డమీద తండా సర్పంచ్ కేతావత్ రామ్ సింగ్ గారు, వర్జన్ తండా సర్పంచ్ బాణావత్ మోజీరావ్ గారు, యువ నాయకులు కిషోర్ గౌడ్, ఆకుల జగన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మలావత్ సంతోష్ గారు, మాజీ ఎంపీటీసీ నౌసిలాల్ గారు, సిరికొండ బంజారా కమిటీ అధ్యక్షులు పాకాల రూప్ సింగ్ గారు, తోయేటి వినోద్ గారు, తుంపల్లి డిప్యూటీ సర్పంచ్ శ్రీకాంత్ గారు సంతోష్★ మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్ లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను అభినంధించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, నేటి శుభోదయ :** జులై 7 నుండి 9 వరకు వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్లో జరిగిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్–2026 లో వృత్తి నైపుణ్యాల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. జోనల్ స్థాయిలో కనబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు.

**పతకాలు సాధించినవారు**

టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ వి. ఉదయ్ కుమార్, ఫోరెన్సిక్ సైన్స్, చట్టం అండ్ దర్యాప్తు రాత పరీక్షలలో రెండు బంగారు పతకాలు, వేలిముద్రల ప్రాక్టికల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు. కూసుమంచి ఎస్సై వి. దివ్య, వైద్య–న్యాయ పరిశీలన పరీక్షలో రజిత పతకం, ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కాంస్య పతకం సాధించారు. ఏ ఆర్ కానిస్టేబుల్ ఎం. మహేష్, యాక్సెస్ కంట్రోల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు.ఏ ఆర్ కానిస్టేబుల్ పి.కిరణ్, డాగ్ స్క్వాడ్ పోటీలో కాంస్య పతకం సాధించారు.ఈ డ్యూటీ మీట్లో జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబూ బాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీసులు అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషన్, ఫొటో, వీడియో గ్రాఫిక్ విభాగాల్లో పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ సాంబరాజు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చకు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా జంగం మహేష్ స్వామి.



**సంగారెడ్డి , నేటి శుభోదయ** తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ గారు సదాశివపేట పెట్టణవాసి జంగం మహేష్ స్వామి ని రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. జంగం మహేష్ స్వామి మాట్లాడుతూ గతంలో కూడా రాష్ట్ర సహాయక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించినట్లు నాపై నమ్మకంతో మరొకసారి రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర ప్రతినిధిగా బాధ్యత అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 7000 మంది అర్చకులకు సేవ చేసేటటువంటి అవకాశం దక్కినందుకు రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవ శర్మ గారికి ప్రధాన కార్యదర్శి కోశాధికారి గారికి అదేవిధంగా సహకారం అందించినటువంటి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అడివయ్య స్వామి మరియు జిల్లా కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రత్యామ్నయ పంటలు సాగు చేసుకోవాలి

**- కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్**



**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** ప్రస్తుత వర్షాభావం పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నయ పంటలను సాగు చేసుకోవాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్ సూచించారు. మండలం లోని మోటాపురం, మండ్రాజుపల్లి, చెరువుమాధారం, ముజ్జుగూడెం రైతు వేదికలలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సీజన్ ఎల్నినో ప్రభావం తీవ్రతం చూపుతుందన్నారు. వరి కాకుండా ఇతర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. 60 రోజులలో పంట చేతికొచ్చే వాటిని సాగు చేసుకోవాలన్నారు. పప్పు దినుసుల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్కువ కాల పరిమితి పంటలనే రైతులు ఎంచుకోవాలని అన్నారు. పంట కుంటలకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తిగా వంద శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. వరి తప్పనిసరి అయితే వారికి సాగునీటి సౌకర్యం ఉన్నప్పటకీ సాగు విస్తీరణం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఆయా క్లస్టర్స్ ఏఈఓ లు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలోని క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా ఆర్థిక పోషకాహార సహాయం



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలోని క్షయ (టీబీ) వ్యాధి గ్రస్తులందరికీ కేంద్ర ప్రభుత్వ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్ టిఈపి) కింద అమలు చేయబడుతున్న 'నిక్షయ్ పోషణ్ యోజన (ఎన్ పివై) "పథకం ఒక గొప్ప వరమని, జిల్లాలోని అర్హులైన రోగులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఒక ప్రకటనలో కోరారు.ఈ పథకం ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు చికిత్స కాలంలో మెరుగైన పోషకాహారం అందించడం కోసం నెలకు రూ 1,000 చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకే జమ చేయడం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, వ్యాధి నిర్ధారణ అయిన సమయంలో రూ 3,000 లు, 84 రోజుల చికిత్స పూర్తయిన తర్వాత మరో రూ 3,000 చొప్పున మొత్తం రూ 6,000 ఆర్థిక సహాయం లభిస్తుంది.పథకం ప్రగతి వివరాలు (2025 – 2026), 2025 లో సాధించిన ప్రగతి, గత ఏడాది 2025 లో కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు రూ 17,00,000 విడుదల చేసింది. దీని ద్వారా జిల్లాలోని 283 మంది నమోదిత టీబీ రోగులకు తలా రూ 6,000 చొప్పున ఆర్థిక సహాయం అందించి, వారు సక్రమంగా మందులు వాడేలా, త్వరగా కోలుకునేలా తోడ్పాటునందించాం అని తెలిపారు. 2026 ప్రస్తుత నిధులు , పురోగతి, ఈ ఏడాది (2026) కు గానూ ఖమ్మం జిల్లాకు అత్యధికంగా రూ 39,54,000 నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతానికి 460 మంది అర్హులైన రోగులను గుర్తించాం అని తెలిపారు. ఈ నెల చివరి నాటికి వారి బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు జమ చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మరో 211 మంది రోగులకు రూ 3,000 చొప్పున, అలాగే 324 మంది రోగులకు రూ 6,000 చొప్పున నిధులు విడుదల చేయాలని రాష్ట్ర టీబీ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాం. అక్కడ ఆమోదం లభించిన వెంటనే ఈ నిధులు కూడా బదిలీ చేయబడతాయి అని తెలిపారు. ఇవే కాకుండా, కొత్తగా గుర్తించిన మరో 189 మంది అర్హులైన టీబీ రోగుల వివరాల పరిశీలన జరుగుతోంది. ప్రక్రియ పూర్తి కాగానే వారికి కూడా నిధులు అందుతాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రుల్లో క్షయ (టీబీ) వ్యాధికి చికిత్స పొందుతున్న రోగులందరూ తమ వివరాలను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఆర్థిక సహాయం నేరుగా మీ ఖాతాల్లో పడటానికి మీ ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలను స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు లేదా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అందించాల్సిందిగా కోరుతున్నాం అని తెలిపారు. క్షయ రహిత ఖమ్మం జిల్లా నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని, టీబీ రోగులు ఈ పోషకాహార పథకాన్ని ఉపయోగించుకుని ఆరోగ్యవంతులు కావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ఆకాంక్షించారు.

## పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తాం



**కొత్తగూడెం, పాల్వంచ, నేటి శుభోదయ :** పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ పట్టణంలో బుధవారం రూ.1.73 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శంకుస్థాపనల సభల్లో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 31, 33, 34, 36, 38, 42, 45 డివిజన్లలో ఈ నిధులతో మొత్తం 10 అభివృద్ధి, నిర్మాణ పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు వివరించారు. ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే ఈ నిధులను మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచేందుకు డ్రైన్ల నిర్మాణంతో పాటు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు సిమెంట్ రోడ్లను నిర్మిస్తామన్నారు. ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపక్షం నిలిచే ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, పాల్వంచ పట్టణ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేషన్ కమిషనర్ కె సుజాత, తహసిల్దార్ దారా ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏ డి ఈ అబ్దుల్ రెహమాన్, డిప్యూటీ కమిషనర్ విజయానంద్, టౌన్ ఎస్సై తోట నాగరాజు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, సింధు తపస్వి, సుగుణ, నరేష్, మధుచంద్, విజయలక్ష్మి , సీపీఐ నాయకులు శనగారపు శ్రీనివాసరావు, గౌతమి కృష్ణ, శేఖర్ బాబు, వై ఎస్ గిరి, నాగమణి, ఎస్ ఏ రెహమాన్, ఆలపాటి ప్రసాద్, కరీం, కాకటి రవీందర్, దినేష్, నరేష్, నవీన్, అంజాద్, రామాచారి, బట్టు హరి, చరప శ్రీను, లక్ష్మీ, రాజేశ్వరరావు, జిలానీ, భీమనాయక్, ఆదినారాయణ, అశోక్, వివిధ శాఖల డిఇలు, ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉమ్మాజీ నరేష్ ఆర్థిక సాయం పుస్తకాల కొనుగోలుకు రూ. 10,000 విరాళం



**నిజామాబాద్, నేటి శుభోదయ :** సిరికొండ మండలం హుస్సేన్ నగర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ యూత్ జిల్లా నాయకులు ఉమ్మాజీ నరేష్ అన్నారు. హుస్సేనగర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల పుస్తకాల కొనుగోలు నిమిత్తం ఆయన రూ. 10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ జీలా మల్లేష్ కు అందజేశారు.ఈ సందర్భంగా ఉమ్మాజీ నరేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ చిన్న సహాయం అందించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా విద్యార్థుల ఉన్నత చదువులకు, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.తమ పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సాయం అందించినందుకు సర్పంచ్ మల్లేష్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఉమ్మాజీ నరేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిలా మల్లేష్, కమ్మరి లింబాద్రి స్థానిక కాంగ్రెస్ నాయకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తూంపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**నిజామాబాద్, నేటి శుభోదయ :** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.) నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఈరోజు అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా తూంపల్లి సర్పంచ్ జినుక రాజేందర్,ఉప సర్పంచ్ అయినాల శ్రీకాంత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి గారికి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులను మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపిస్తున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారి సహకారం అభినందనీయమన్నారు. గ్రామంలోని రహదారుల అభివృద్ధితో ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని, భవిష్యత్తులో కూడా గ్రామాభివృద్ధికి ఇలాంటి మరిన్ని పనులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జినుక రాజేందర్,ఉప సర్పంచ్ అయినాలా శ్రీకాంత్ ఏఈ క్రాంతి, వార్డు సభ్యులు రవి, కళ, సౌందర్య, గ్రామ శాఖ అధ్యక్షులు తెల్ల లక్ష్మణ్, దేవరాజ్, బుచ్చన్న, ప్రశాంత్, లక్పతి, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్లు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్ల వాహనాలపై ప్రత్యేక డ్రైవ్







**ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ :**
రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు బుధవారం ఉదయం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 36 వాహనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి, రూ. 7,510/- జరిమానా విధించి వసూలు చేశారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులు అందరూ తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్లను వక్రీకరించడం, అంకెలను మార్చడం లేదా స్పష్టంగా కనిపించకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని, ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. పట్టణంలో రోడ్డు భద్రతను పటిష్టం చేయడానికి ఇటువంటి డ్రైవ్ లు నిరంతరం చేపడుతామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యం!

### ఎమ్మెల్యే కసిరెడ్డి, నారాయణరెడ్డి



**తలకొండపల్లి, నేటి శుభోదయ :**
కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి సాయ శక్తుల శ్రమిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అనంతరం తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామపంచాయతీలో నూతనంగా మంజూరైన 20 లక్షల గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.అలాగే ఎన్ఆర్ఈజీఎస్ (NREGS) నిధులతో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు.తదుపరి వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనంను ప్రారంభించారు.అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.కుప్పగండ్ల గ్రామపంచాయతీలో నూతన (హక) కేంద్రం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో తలకొండపల్లి,వెల్దండ మండలానికి చెందిన సర్పంచులు, ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పల్లెల అభివృద్ధినే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### -ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి





**మధిర, ఎర్రుపాలెం, నేటి శుభోదయ :**
గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో, మధిర మరియు ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీ లాడ్స్ నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన మొత్తం 14 సీసీ రోడ్లను ప్రారంభించారు. మధిర మండలం మాటూరు నుంచి ఆరంభమై ఎర్రుపాలెం రేమిడిచర్లలో ముగిసే మధిర మండలం మాటూరు గ్రామం నుండి ప్రారంభమైన ఈ పర్యటన, ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, తక్కెళ్లపాడు, బనిగండ్లపాడు, మీనవోలు, ఎర్రుపాలెం మండల కేంద్రం మరియు రేమిడిచర్ల గ్రామాల్లో కొనసాగింది. వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంపీ శ్రీకారం చుట్టారు. తక్కెళ్ళపాడు గ్రామంలో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. నేడు ప్రారంభించిన ఈ రోడ్లు గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగిస్తాయని చెప్పారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మాజీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, అంకిరెడ్డి, సర్పంచులు ముక్కరి రామకృష్ణారెడ్డి, కూరపాటి రమేష్, అప్పారావు, నంద్రు అశ్విని, బలుసుపాటి జయరావు, కొత్తపల్లి ప్రశాంత్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్లం చలపతిరావు కుటుంబాన్ని పరామర్శించిన మందడి ఇజ్రాయిల్



**తిరుమలాయపాలెం, నేటి శుభోదయ :**
తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన బెల్లం చలపతిరావు ఆదివారం మరణించిన విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల పాలేరు నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బెల్లం చలపతిరావు గ్రామంలో రాజకీయ, సామాజిక రంగాల్లో విశేష అనుభవం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని, ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, పెద్దలు, రాజకీయ నాయకులు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తూ, అవసరమైన సూచనలు, సలహాలు అందించేవారని గుర్తు చేశారు. ఆయన సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ మరువలేరని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం

### - యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ వెల్లడి




**ఖమ్మం, నేటి శుభోదయ :**
యశోద మెడికల్ సెంటర్ ఖమ్మం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ మాట్లాడుతూ తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో , ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' ( కృత్రిమ గుండె – ఊపిరితిత్తుల పరికరం ) విధానం ఒక సంజీవనిలా మారుతోందని తెలిపారు . ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం యొక్క విశిష్టతను, మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు . ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి , చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు . ప్రాణం నిలిపే 'ఎక్మో' (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనో – వీనస్ ఎక్మో' లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని అన్నారు . ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది . ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది . ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు , దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు . సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్య శాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ . రక్తం గడ్డకట్టడం , అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ గుండె – ఊపిరితిత్తుల నిపుణులు , అనస్థీషియా వైద్యులు , ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని , ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని , ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు . విజయవంతమైన రికవరీ విధానం శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం, వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి , కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని, ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ (రిహాబిలిటేషన్) ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు . ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్ పరమేష్ , అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు .

## మధిర మండలంలో పర్యటించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**మధిర, నేటి శుభోదయ :**
మధిర నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు విచ్చేసిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి బుధవారం మధిర మండలంలో పర్యటించారు. పర్యటనలో భాగంగామండలంలోని మాటూరుపేట గ్రామంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదాల రామారావు ఇంటికి వెళ్లారు.ఈ సందర్భంగా ఎంపీ మాదాల రామారావు కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడిపారు. గ్రామంలోని రాజకీయ, అభివృద్ధి అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. ఈ సందర్భంగా మాటూరుపేట గ్రామ అభివృద్ధికి కేంద్రం నుండి పూర్తి సహకారం అందిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ముందుగా మాటూరు పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఎంపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాటూరుపేట గ్రామ సర్పంచ్ చిలువేరు పూర్ణమ్మబుచ్చిరామయ్య, నాగవరపాడు సర్పంచ్ భీమనబోయిన ఈశ్వరమ్మ, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కూలిన పాఠశాల ప్రహరీగోడ



**నేలకొండపల్లి, నేటి శుభోదయ**
మండలం లోని బోదులబండ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూలింది. బోదులబండ పాఠశాల కు ఉన్న ప్రహరీ గోడ బుధవారం అకస్మాత్తుగా గోడ కుప్పకూలింది. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవటం ప్రమాదం తప్పింది. పాఠశాల కు వెనక భాగం మొత్తం వ్యవసాయ పోలాలు ఉండటంతో ప్రహరీ లేకపోవటంతో విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కూలిన పాఠశాల ప్రహారీ గోడ ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతు నరేందర్, సర్పంచ్ కట్టెకోల నాగార్జున లు సందర్శించారు. విషయం ను మండల విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నూతనంగా ప్రహరీ గోడ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు.

## 18, 19న గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు
### -రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఈనెల 18, 19 తారీఖున పాల్వంచలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పిలుపునిచ్చారు. బుధవారం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్లో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు అఖిల భారత ఆదివాసీ మహాసభ ఇంచార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి డి. అనీరాజా, జాతీయ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత ఆదివాసీ మహాసభ పసుపతి కోల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలకు ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలలో గిరిజనుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, అధ్యక్షులు బానోత్ రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా నర్సింహా, పాల్తియా శ్రీను, గుగులోత్ శ్రీను, బానోత్ రామ్మూర్తి, భూక్యా శ్రీకాంత్, గుగులోత్ లచ్చిరాం, బోడా చిన్న పాల్గొన్నారు.

## భూ సేకరణ విచారణ పారదర్శకంగా నిర్వహించాలి -జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**మంథని / భూపాలపల్లి, నేటి శుభోదయ :**
భూపాలపల్లి జిల్లా తాడిచర్ల డేంజర్ జోన్‌లో భూ సేకరణ విచారణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి డేంజర్ జోన్ పరిధిలోకి వచ్చే ప్రతి ఇంటిని తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. నిర్వాసితుల విచారణ కోసం ఐదు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టీమ్‌కు నాయబ్ తహసీల్దార్ పర్యవేక్షణ ఉంటుందని, గిర్దావర్, సీనియర్ లేదా జూనియర్ అసిస్టెంట్, పంచాయతి కార్యదర్శి, గ్రామ పాలన అధికారి, జెన్కో ఏఈలు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఎలాంటి వత్తిళ్లు, పైరవీలు లేకుండా విచారణను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు.డేంజర్ జోన్‌లోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి చెక్‌లిస్ట్ ప్రకారం కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, ప్రతిరోజు పూర్తి చేసిన ఫారాలను కాటారం ఆర్డిఓ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, డిపిఓ శ్రీలత, కాటారం ఆర్డిఓ రవీందర్, విద్యుత్ శాఖ డీఈలు పాపిరెడ్డి, జగదీష్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, మల్హర్ తహసీల్దార్ రవికుమార్, సర్వే టీము సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధికార కక్షసాధింపు రాజకీయాలు సరికాదు





**ఖమ్మం, నేటి శుభోదయ :**
సిపిఐతో ఉన్న మిత్రధర్మాన్ని పాటించకుండా రాజకీయ కక్షసాధింపులో భాగంగా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు.బుధవారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో ఎన్ఎస్పీ కాల్వను సిపిఐ మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించారనే ఆరోపణల నేపథ్యంలో మున్సిపాలిటీ సిపిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. ఈ పరిశీలనలో 23, 24, 28, 29, 30, 31, 32 డివిజన్ల శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ ఎన్ఎస్పీ కాల్వ ఆక్రమణ జరిగిందనే ఆరోపణలు పూర్తిగా అసత్యమని అన్నారు. ఆటోనగర్ ఏర్పాటు సమయంలో అసలు పంట కాల్వ మార్గాన్ని మార్చివేశారని, ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ప్రాంతం ఆ మార్పుల ఫలితమేనని తెలిపారు.స్థానిక రైతులు కూడా పాత పంట కాల్వను తిరిగి పునరుద్ధరించాలని చాలా కాలంగా కోరుతున్నారని చెప్పారు. రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా అధికారులు పాత కాల్వ మార్గాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అలాగే కాల్వ మార్పునకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సిపిఐపై చేస్తున్న అసత్య ఆరోపణలు, కక్షసాధింపు రాజకీయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఐ ప్రతినిధి బృందం**
సిపిఐ పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కబ్జాకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సిపిఐ నిజ నిర్ధారణ కమిటీ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. తొలుత వరంగల్ క్రాస్ రోడ్డులోని సిపిఐ కార్యాలయం వద్దకు చేరుకొని, అక్కడి నుంచి కాలినడకన ర్యాలీగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అసలు కాల్వ ఎక్కడి నుంచి ఉందనే విషయాన్ని మొత్తం పరిశీలించారు.ఈ సందర్భంగా 28, 30, 32 డివిజన్లకు చెందిన సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ కాల్వ ఆక్రమణ ఆరోపణలు అవాస్తవమని, సిపిఐ పార్టీపై బురద చల్లాలనే ఉద్దేశంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అసలు కాల్వ ఇక్కడ లేదని, గతంలో ఆటోనగర్ ఏర్పాటు సమయంలో దానిని మరోవైపు మళ్లించారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు పాత కాల్వను పునరుద్ధరించి, మార్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కాల్వను పునరుద్ధరించాలి :రైతులు**
ఆటోనగర్ ఏర్పాటులో ఎన్ఎస్పీ కాల్వను మార్చి తమ పొలాలు, నివాసాల వైపు మళ్లించారని అక్కడి రైతులు ఆరోపించారు. ప్రస్తుతం కాల్వగా పేర్కొంటున్నది అసలైన కాల్వ కాదన్నారు. అక్రమ పద్ధతిలో ఏర్పాటు చేసిన కాల్వతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు దారి లేకుండా చేసి, లేని కాల్వను ఉన్నట్లుగా సృష్టించారని ఆరోపించారు. అలాంటి కాల్వను కాకుండా పాత కాల్వను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అటువంటి కాల్వకు బఫర్ జోన్ అంటూ మా భూములను లాక్కోవాలని చూడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మెడకంటి వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, బానోతు రామకోటి, వెంపటి సురేందర్, 28, 30, 32 డివిజన్ల కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు మెడకంటి పెద్ద వెంకటరెడ్డి, మామిడి సుదర్శన్ రెడ్డి, బట్ట బాబు, వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ రంగంలో ఉత్తమ వ్యవసాయ పద్ధతుల అధ్యయనం



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఆయిల్ పామ్ రంగ అభివృద్ధికి మార్గదర్శకంగా ఈ అధ్యయనం దోహదపడుతుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి యం.వి.మధుసూదన్ తెలిపారు. సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో ఆయిల్ పామ్ రంగంలో అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, వినూత్న కార్యక్రమాలు, రైతుల అనుభవాలను నమోదు చేసే అధ్యయనం చేయడానికి 2026 జూలై 13 నుండి 17 వరకు ప్రత్యేక అధ్యయన కార్యక్రమం నిర్వహించబడుతోందనిఅని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లాలో రఘునాధపాలెం, బాలపేట లోని మానుకొండ రాధా కిషోర్ , తాత రఘురాం ఆయిల్ పామ్ తోటలను, తిరుమలాయపాలెం, కొక్కిరేణి గ్రామంలోని వేమ వేంకటేశ్వర రావు ఆయిల్ పామ్ తోటను, కొణిజర్ల మండలం లోని ఆయిల్ పామ్ నర్సరీ ని సీఆర్‌బీ ప్రతినిధుల బృందం పర్యటన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ ఫెడ్ అధికారి అశోక్, ఇతర సభ్యులతో కూడిన సీఆర్‌బీ ప్రతినిధుల బృందం సందర్శించి, ఆయిల్ పామ్ సాగు పురోగతి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సాంకేతిక పద్ధతులు, రైతుల అనుభవాలు, ఆయిల్ పామ్ విలువ శ్రేణికి సంబంధించిన అంశాలను పరిశీలించింది.పర్యటన సందర్భంగా ఆయిల్ పామ్ రైతుల క్షేత్రాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ మిల్లులను సందర్శించడంతో పాటు రైతులు, అధికారులు, ఇతర భాగస్వాములతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ పామ్ సాగులో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను నమోదు చేయనున్నారు.ఈ అధ్యయనంలో ముఖ్యంగా నీటి నిర్వహణ, నేల ఆరోగ్య పరిరక్షణ, సమీకృత చీడపీడల నిర్వహణ (ఐపిఎం), కార్మిక సంక్షేమం, భద్రతా పద్ధతులు, సుస్థిర వ్యవసాయ విధానాలు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి యం.వి.మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ విస్తరణకు ప్రాధాన్యత నిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, నాణ్యమైన మొక్కలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర సేవలను అందిస్తున్నదని తెలిపారు. ఈ అధ్యయనం ద్వారా తెలంగాణలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ అధ్యయనం తుది ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో సుస్థిర ఆయిల్ పామ్ సాగులో అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, విజయవంతమైన కార్యక్రమాలు మరియు రైతుల అనుభవాలను ప్రతిబింబించే సమగ్ర అధ్యయన నివేదిక రూపొందించబడుతుంది. ఇది భవిష్యత్తులో ఆయిల్ పామ్ రంగ అభివృద్ధికి మార్గదర్శకంగా ఉపయోగపడనుంది అని తెలిపారు.

## యువతకు 'మై భారత్' పిలుపు
### -మేడ్చల్-మల్కాజిగిరిలో నమోదు కార్యక్రమం ప్రారంభం



**మేడ్చల్ మల్కాజిగిరి, నేటి శుభోదయ :**
దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన 'మై భారత్' పోర్టల్ నమోదు కార్యక్రమాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు గల యువత తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.'మై భారత్' ద్వారా స్వచ్ఛంద సేవ, నైపుణ్యాభివృద్ధి, అనుభవపూర్వక అభ్యాసం, సామాజిక సేవతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ యువజన కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్ఎస్ఎస్ విభాగాలు తదితర భాగస్వామ్య సంస్థలు ఈ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, అర్హులైన యువత ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు.కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్కడికక్కడే నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సహకారంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన 'మై భారత్' విభాగం సమన్వయం చేస్తోంది.కార్యక్రమంలో జిల్లా 'మై భారత్' డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, కార్యాలయ సహాయకుడు డి. శ్రీశైలం పాల్గొని, పోర్టల్ ద్వారా యువతకు లభించే అవకాశాలు, ప్రయోజనాలను వివరించారు. యువత అంతా నమోదు చేసుకుని వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

## కులాంతర ప్రేమ వ్యవహారం.. మాదాపూర్ లో యువకుడి దారుణ హత్య



**వరంగల్, నేటి శుభోదయ :** ప్రేమ పేరుతో ఇద్దరి యువతులను వేధిస్తున్న వ్యక్తిని యువతుల కన్నతండ్రి హతమార్చాడు. ఈ ఘటన మాదాపూర్‌లో అర్ధరాత్రి చోటు చేసుకుంది. అందరూ చూస్తుండగానే జరిగిన దారుణ హత్య కలకలం రేపింది. ఇద్దరు యువతులను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడనే కోపంతో.. వారి తండ్రి, బంధువు కలిసి ఓ యువకుడిని కత్తులతో నరికి చంపారు.అనంతరం నిందితులిద్దరూ నేరుగా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిన్నపెల్లి భాస్కర్ (30) మాదాపూర్‌లోని"శ్రీ శ్రీనోమా"హోటల్‌లో కుక్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు.మంగళవారం అర్ధరాత్రి 11:45 గంటల సమయంలో మాదాపూర్ అరుణోదయ కాలనీలోని రామేశ్వరం కేఫే ఎదుట కనిపించిన భాస్కర్‌పై ఒక్కసారిగా కర్రలు, కత్తులతో దాడికి తెగబడ్డారు. తలతో పాటు శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో భాస్కర్ రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

**వివాదానికి కారణం ఇదే...**

మృతుడు భాస్కర్ వరంగల్‌కు చెందిన ఇద్దరు సోదరీమణులను ప్రేమ పేరుతో కొంతకాలంగా వెంబడిస్తూ, ఫోన్ సందేశాల ద్వారా వేధిస్తున్నట్లు యువతి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ వేధింపులపై గతంలోనే వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ భాస్కర్‌లో మార్పు రాలేదని, వేధింపులు కొనసాగించాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమ్ముంటే హైదరాబాద్ రండి.. చూసుకుందాం! భాస్కర్ సవాల్ చేశాడు.ఈ వేధింపుల విషయం తెలిసి యువతుల తండ్రి తమ్మెడబోయిన రాజు.. భాస్కర్‌కు ఫోన్ చేసి మందలించాడు. అయితే భాస్కర్ వెనక్కి తగ్గకుండా దమ్ముంటే రండి చూసుకుందాం అంటూ రాజుకు సవాల్ విసిరినట్లు పోలీసులు తెలిపారు. భాస్కర్ సవాల్‌తో ఆగ్రహానికి గురైన రాజు.. తన బావమరిది మారం కుమారస్వామితో కలిసి హైదరాబాద్‌కు చేరుకున్నాడు.మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫే సమీపంలో భాస్కర్‌ను అడ్డుకుని, వెంట తెచ్చుకున్న కత్తులు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చారు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు, దాడికి పాల్పడిన ప్రధాన నిందితులు తమ్మెడబోయిన రాజు, మారం కుమారస్వామి ఇద్దరూ స్వయంగా మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఈ ఘటనపై మాధాపూర్ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియను విజయవంతం చేయాలి

**బోనకల్, నేటి శుభోదయ :**
బోనకల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. బోనకల్‌లోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్‌ఏలు)తో సమావేశమై కార్యక్రమం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, అర్హుల పేర్లు నమోదు చేయడం, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.ఓటర్ల జాబితా సక్రమంగా ఉండటం వల్ల ఎన్నికల ప్రక్రియ మరింత విశ్వసనీయంగా సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలు కూడా ఈ ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన



అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమంలో అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం బోనకల్ మండల మాజీ జెడ్పిటిసి బానోతు కొండ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని, అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఓటర్ల జాబితాను మరింత పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోనకల్ మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పారా ప్రసాద్, నాగేశ్వరావు, బంధం నాగేశ్వరావు, ఇటుకల శ్రీను, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరెంద–మల్లారంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం

**మంథని, నేటి శుభోదయ :**
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మంథని మండలంలోని ఆరెంద, మల్లారం గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్, సహకార సంఘం డైరెక్టర్ రావికంటి సతీష్, ఉట్ల అనిల్ రెడ్డి, కొమ్మిడి గోవర్దన్ రెడ్డి, ఉట్ల అక్షిత్ రెడ్డి, మానెం రాజేందర్, గాడేప్పు బానేష్, మసిరెడ్డి లక్ష్మారెడ్డి, పొట్ల శ్రీకాంత్, పొట్ల రవితో పాటు గ్రామ పంచాయతీ అధికారి, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించారు. బూత్ స్థాయి ప్రతిని



ధులు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో సర్వే నిర్వహించారు. ప్రజలు ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించి అవసరమైన వివరాలను అందించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాలు రావాలంటే వెల్జాల్ "బొజ్జ వెంకయ్యకు,శివునికి అభిషేకం", చేయాల్సిందే!

**తలకొండపల్లి, నేటి శుభోదయ :**
సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ ప్రజలు తమ వినూత్న నమ్మకాన్ని, ఆచారాన్ని గుర్తుచేసుకుంటున్నారు.గ్రామంలో వర్షాలు పడాలంటే స్థానిక శివాలయంలోని శివునికి గ్రామంలోని సహదేవి సముద్రం చెరువు నీటితో అభిషేకం చేయడంతో పాటు,గ్రామానికి చెందిన బొజ్జ వెంకయ్య స్వామి కి ఆవుపేడ పూయడం,గ్రామంలోని ముదిరాజుల ఆడపడుచులు కప్పతల్లి ఆటలు ఆడడం ఇక్కడి అనాది ఆచారం.ఇలా చేయడం వల్ల గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని గ్రామస్తుల గట్టి నమ్మకం.ప్రస్తుతం వర్షాలు లేక కరవు పరిసితులు నెలకొనడంతో.. గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని తక్షణమే ఈ సాంప్రదాయ పూజలు,పునస్కారాలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఇప్పటికే వర్షాలు రాక రైతాంగం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.ఆ వరుణ, దేవుడు



ఎప్పుడు కరుణిస్తాడా అని వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్న రైతులు. వాన కాలంలో ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావంతో మొక్కలు నాటిన రైతులు వర్షం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

## ఆర్ఎంపీ & పీఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**ముత్తారం, నేటి శుభోదయ :**
ఆర్ఎంపీ & పీఎంపీ వైద్యుల సంక్షేమం,వారి వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని మంథని డివిజన్ అధ్యక్షుడు,కరీంనగర్ జోనల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.వి. చారి
తెలిపారు. ఆ ర ఎ ంపీ, ప ీఎంపీ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.వారి హక్కుల పరిరక్షణ,సంక్షేమం,శిక్షణా కార్యక్రమాలు,ప్రభుత్వ గుర్తింపు తదితర అంశాలపై సంఘం తరపున ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ సభ్యుల ఐక్యతతో ముందుకు సాగాలని వారు సూచించారు.గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధానలక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డాక్టర్ చారి తెలిపారు.

## త్రివేణి పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక




**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక ప్రక్రియను 11వ బెటాలియన్ ఎన్‌సీసీ ఖమ్మం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ కుమార్, ఎన్ బి, ఎస్ యుబి లక్ష్మణ్ వాబుల్, హెచ్ ఏవి ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఎంపికలో భాగంగా 25 సీట్ల భర్తీకి 85 మంది విద్యార్థులు పాల్గొనగా వారికి ఫిజికల్ టెస్ట్, జీకే (50 మార్కులు) రాత పరీక్ష, ఇండివిడ్యువల్ ఇంటర్వ్యూ నిర్వహించి, ప్రతిభ ఆధారంగా 25 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ పి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ వి. శ్యామ్ సింగ్ సమన్వయం చేయగా, ఉపాధ్యాయ బృందం సహకరించగా,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం పై రైతులు అవగాహన




**మధిర టౌన్, నేటి శుభోదయ :**
మధిర మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య సందర్శించి రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన కల్పించడం జరిగింది రైతులు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు. అలానే ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు ఇతర చిరుధాన్యాల పంటలు పండించాలని సూచించడం జరిగింది. ఈ సంవత్సరం భూగర్భ జలాలు అడుగంటి పోవడం జరుగుతుందని, ముందస్తు ప్రణాళికలో భాగంగా వరి మిర్చికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలని రైతులకు వివరించారు. మండలంలో జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు ఫార్మ్పండ్స్ (పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం వి బి జి రామ్ జి పథకం ద్వారా నూరు శాతం రాయితీపై అందిస్తుందని,ఈ ఫార్మ్ పాండ్స్(పంట కుంటలు) పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్ గ,వివిధ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

## సర్ పై అవగాహన కల్పించడమే మా లక్ష్యం!

### -మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి



**తలకొండపల్లి, నేటి శుభోదయ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్‌పై ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో అవగహన కల్పించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బీఎల్ వోలు, బి ఎల్ ఏ చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు..ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగహన కల్పించారు.ఈ సందర్భంగా మార్కెట్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని పేర్కొన్నారు.ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైన ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకునేలా అవగహన కలిగి ఉండాలని సూచించారు.ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియన నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబంలోని ఓటర్లు తమ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నమోదు చేసి బి ఎల్ ఓ, బీఎల్ఎలకు అందజేయాలని ఓటర్లకు ఆయన సూచించారు.కార్యక్రమంలో నాయకులు జి శ్రీనివాసమూర్తి ,ఏ.అంజయ్య గౌడ్,ఎం.అంబాజి, బి .నర్సింలు, అజీజ్ , టి కృష్ణయ్య గౌడ్, వి.రాజు, పులిజాల విష్ణు, జాఫర్, అంగన్వాడి టీచర్ లు వసంత లక్ష్మి ,భూషణమ్మ, నశ్రీన్ బేగం, బిఎల్వోలు పి చంద్రకళ, బి సుధా,బుక్ కిపర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సానుభూతిపరురాలు లింగ నాగరత్నమ్మ మృతి



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం రూరల్ మండలానికి చెందిన దివంగత సిపిఐ సీనియర్ నాయకుడు లింగ రామయ్య సతీమణి, పార్టీ సానుభూతిపరురాలు లింగ నాగరత్నమ్మ బుధవారం తన నివాసంలో కన్నుమూశారు.విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు మృతురాలి నివాసానికి చేరుకుని ఆమె భౌతికకాయంపై అరుణ పతాకం కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లింగ నాగరత్నమ్మ మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.మృతురాలికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణ కుమార్, పాలేరు నియోజకవర్గ నాయకుడు లింగా వెంకటనారాయణ, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ నాయకులు చుండూరు కృష్ణ, పట్టాభి తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## బి ఎల్ ఓ కు ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేసిన ఆర్జేసి కృష్ణ



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 46వ డివిజన్ బి ఎల్ ఓ కు బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ తన ఎన్యుమరేషన్ ఫారాన్ని బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా వారు కూడా వారి ఫారాలను బి ఎల్ ఓ లకు అందజేయాలని కోరారు. పార్టీ శ్రేణులు కూడా ఓటర్ల యింటికి వెళ్లి ఫారాలు నింపించి బి ఎల్ ఓ లకు అందజేయాలని సూచించారు.ఫారాలు నింపడం రాని వారికి తమ పార్టీ బి ఎల్ ఏ లు అందుబాటులో ఉంటారని ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ 46వ డివిజన్ ఇంచార్జీ కనకం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొండలగోపారంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**మధిర, నేటి శుభోదయ :** మధిర మండల పరిధిలోని తొండలగోపారం గ్రామంలో స్థానిక శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.11లక్షలతో సిసి రోడ్లు, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.10లక్షలు మంజూరు చేశారు.బుధవారం మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, మాజీ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సర్పంచ్ షేక్ కన్నం సాహెబ్, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవి కుమార్ లు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకుపూజా కార్యక్రమం చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొండల గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలో రెండు వివో బిల్డింగులు సిసి రోడ్లు దాదాపు రూ.20 లక్షలు నిధులు స్థానిక శాసనసభ్యులు ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేశారని, గత సంవత్సరంలో కూడా రూ.30 లక్షలు సిసి రోడ్ల కు మంజూరు చేయగా రోడ్లు నిర్మాణం పూర్తయిందని తెలిపారు.అలాగే తొర్లపాడు నందు గల ప్రాథమిక పాఠశాల పూర్తి శిథిలావస్థ దశకు చేరుకున్నదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి విన్నవించగా నూతన బిల్డింగ్ మంజూరు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి పాటుపడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు గ్రామ శాఖ అధ్యక్షులు చేబ్రోలు కృష్ణ సూర్యదేవర వెంకటేశ్వరరావు నారెట్ల వెంకటరెడ్డి వాసిరెడ్డి రవి కుమార్ వాసిరెడ్డి వెంకటరావు రామ పెద్దలు నల్లమల బాబురావు వేల్పుల సత్యనారాయణ ఉప సర్పంచ్ సుంకర రామారావు వార్డ్ మెంబర్లు బొబ్బిళ్ళ వీర వెంకయ్య మేడేపల్లి భవాని శివకృష్ణ కాశి పోయిన అరుణ శేషు కుమార్ ఐలపోగు కృపావరం షేక్ బికార్ సాహెబ్ మేడేపల్లి మాధవరావు నల్లమల భద్రరావు చేబ్రోలు వెంకటేష్ చేబ్రోలు రాము పుల్లూరు సైదమ్మ నల్లమల రామ్మోహన్రావు రొయ్యల మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.







## జూలపల్లిలో ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతం!సర్పంచ్

### -జూలపల్లి సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్

**తలకొండపల్లి, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా పాలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో, కామినేని హాస్పిటల్, ఎల్.బి. నగర్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది.ఈ మెడికల్ క్యాంపులో గ్రామానికి చెందిన 200 మందికి పైగా గ్రామస్తులు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.వైద్య బృందం బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు జ్వరం, జలుబు, శరీర నొప్పులు, బలహీనత వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేసింది.ఈ సందర్భంగా సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు అల్లాజీ గౌడ్,జగదీష్ గౌడ్, గ్రామ కార్యదర్శి విజయభాస్కర్, యువ నాయకుడు మధు,కామినేని హాస్పిటల్ వైద్య బృందం, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు కామినేని హాస్పిటల్ వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





## ఆన్లైన్ లోనే ఇసుక బుకింగ్ ప్రక్రియ జరగాలి

### -ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, నేటి శుభోదయ :** జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్లైన్ లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా ఆన్లైన్ లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఎంత పరిమాణం ఇసుక, ఎక్కడెక్కడి నుండి పొందింది నివేదిక స్పర్పించాలన్నారు. ఇసుకను టీజీఎండీసీ, స్యాండ్ బజార్, స్థానికంగా సమకూర్చుకోవాలని, ఇదీ బుకింగ్ ఆన్లైన్ లోనే చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్ లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక రీచ్ ల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు వెంటనే సమర్పించాలని, ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై సమస్యలు ఉంటే వెంటనే నివేదిక



అందించాలని, అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖలచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనుల పూర్తికి కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీవో టిజిఎండిసి జి. శంకర్, మైన్స్ ఏజి ఏ. రమేష్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, పీఆర్ ఇఇ లు మహేష్ బాబు, రామకోటి, డిఇ లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ఏ ఐ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన

**ముత్తారం, నేటి శుభోదయ :** ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ఏ ఐ పాఠశాలల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోదావరిఖని ఏసీపీ రమేష్ మాట్లాడుతూ..ఏఐ స్కూల్ యొక్క ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం,నాణ్యమైన విద్య అందించడం,విద్యార్థుల నమోదు పెంచడం,పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్



అన్నపూర్ణ–ఉపేందర్ లతో గ్రామ పెద్దలు,పోలీస్ సిబ్బంది అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## ప్రభుత్వ ఉద్యోగులు ఎస్‌బీఐ ఎస్జిఎస్పి (ఎస్ జి ఎస్ పి) శాలరీ ప్యాకేజ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి -ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రత, మెరుగైన బ్యాంకింగ్ సేవలు, కుటుంబ సభ్యులకు అదనపు ప్రయోజనాలు కల్పించే లక్ష్యంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ (ఎస్ జిఎస్ పి) ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ రూపొందించిన ఎస్.జి.ఎస్.పి. శాలరీ ప్యాకేజ్ కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌బీఐ అధికారులు ప్యాకేజ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న ప్రత్యేక సౌకర్యాలు, భీమా రక్షణ, కుటుంబ సభ్యులకు లభించే ప్రయోజనాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎస్‌బీఐ ప్రత్యేకంగా రూపొందించిన స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ (ఎస్ జి ఎస్ పి ) ద్వారా అనేక విలువైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం సాధారణ శాలరీ ఖాతాలను నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఖాతాలను స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ఖాతాలుగా మార్చుకోవడం ద్వారా అదనపు ఆర్థిక భద్రతతో పాటు పలు ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఉద్యోగులు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఎస్బిఐ రిష్తే ద్వారా ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందగలరని, అవసరమైన సమయంలో ఆకర్షణీయమైన రుణ సదుపాయాలు, ప్రాధాన్య సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకేజ్ ద్వారా లభించే ప్రయోజనాలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పూర్తి అవగాహన పెంపొందించుకుని వాటిని వినియోగించుకోవాలని సూచించారు.స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ద్వారా ఒక కోటి రూపాయల వరకు ఉచిత ప్రమాద భీమా రక్షణ ఉంటుందన్నారు.ఎస్బిఐ రిష్తే ద్వారా కుటుంబ సభ్యులకు ప్రత్యేక బ్యాంకింగ్ సౌకర్యాలు, ఆకర్షణీయమైన ప్రయోజనాలు ఉంటాయన్నారు. తక్కువ వడ్డీ రేట్లతో వ్యక్తిగత, గృహ, వాహన తదితర రుణ సౌకర్యాలు పొందవచ్చని తెలిపారు. ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, యోనో వంటి సౌకర్యాల ద్వారా సులభమైన బ్యాంకింగ్ లావాదేవీలు పొందవచ్చని తెలిపారు.ప్రాధాన్య కస్టమర్ సేవలు, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు, ఇతర ప్రత్యేక విలువ ఆధారిత ప్రయోజనాలు ఉంటాయన్నారు.ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమకు అందుబాటులో ఉన్న ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకుని సాధారణ శాలరీ ఖాతాలను ఎస్ జిఎస్ పి ఖాతాలుగా మార్చుకోవాలని, ఇందుకు సంబంధించి సమీప ఎస్‌బీఐ శాఖను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వనపల్లి శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ రామ్ బరన్, ఎల్డీఎం ఎ. రవిప్రసాద్, కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్ మేనేజర్ డి. సునీత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

- గణేష్ ముదిరాజ్



**మియాపూర్ , నేటి శుభోదయ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని తమ ఓటు నమోదు చేసుకోవాలని మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు.మియాపూర్ డివిజన్ మక్త మహబూబ్‌పేట్‌లో "సర్ హెల్ప్ సెంటర్ ను ప్రారంబించి ప్రజలకు మరింత చేరువగా ఉండే లక్ష్యంతో ఈ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఇక్కడ బూత్ లెవెల్ ఆఫీసర్ల ద్వారా ఓటర్ ఐడీకి సంబంధించిన సేవలు, పేరు నమోదు, సవరణలు, చిరునామా మార్పు, ఇతర ఎన్నికల సేవలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతుందనీ, అధికారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ గౌడ్, జె.శ్రీను, దయానంద్, ముదిరాజ్,, రాము, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ బాగోతం ఇలా కూడా ఉంటుందా...??



OFFICE OF THE MUNICIPAL COUNCIL - SATHUPALLI

From
Municipal Commissioner,
Sathupalli

To
The O/o TSNPDCL,
Sathupalli.

Rc.No :-A1/1579/2019

Dt: 12/2019

NO OBJECTION CERTIFICATE

This is to certified that the house bearing No............ is in situated Rajiv Colony in Sathupalli Municipality the Name of Smt/ Sri mallepulla Vas kumar s/o jaggaiah as per the office present record.

The certificate is issued for the purpose of ......... power supply to the above said house.

Certified
Load: 3000W

COMMISSIONER,
MUNICIPAL SATHUPALLI MUNICIPALITY
KHAMMAM DIST. T. S.

**సత్తుపల్లి, నేటి శుభోదయ :** ఎవరికైనా ఏ పని కావాలన్నా, పైసలు ఇస్తే పక్కాగా పనిచేసే పరిస్థితి సత్తుపల్లి మున్సిపాలిటీ ఆదర్శంగా ఉంది. ఇందుకు నిదర్శనంగా పట్టణంలోని రాజీవ్ కాలనీ లో గల 342 ఫ్లాట్ నెంబర్ బుద్దా జయమ్మ పేరుతో పట్టా ఉంది. దానిలో ఒకరు ఉంటూ దాని పైనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం మున్సిపాలిటీలో అప్లై చేసి ఉన్నారు. దానికి కరెంటు మీటర్ కోసమని ఎన్.ఓ.సి ఇచ్చి మీటర్ శాంక్షన్ చేపించిన ఘనత మున్సిపాలిటీకి దక్కింది. ఎన్.ఓ.సి సర్టిఫికెట్ అన్ని తప్పులు గా, స్పెల్లింగ్ మిస్టేక్స్, ఒక ఎగ్జిక్యూటివ్ ఫీల్ చేసినట్లుగా కాకుండా, మిడిమిడి చదువుకున్న వారితో తప్పులుగా రాపించి సర్టిఫికేట్ పొందారు. అదే సర్టిఫికెట్ తో జీవో నెంబర్ 58 రిజిస్ట్రేషన్ చేపించుకున్నట్లుగా సమాచారం. ఆ ఇంటికి ఇప్పటివరకు నీటి బిల్లు గాని, హౌస్ టాక్స్ గాని కట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపల్ సిబ్బంది ఏమి చోద్యం చూస్తున్నారు అర్థం కావట్లేదు. పైసలు ఇస్తే అందరూ మనవాళ్లేనా వాళ్ళని పట్టించుకోరా, పై అధికారులైన పట్టించుకోని నిజా నిజాలు నిరూపణలు చేస్తే నష్టపోయిన వారికి లాభం కలిగే అవకాశాలు ఉన్నాయి.

## శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం..





**శేరిలింగంపల్లి, నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్లలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై శేరిలింగంపల్లి సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఎ), ముఖ్య నాయకులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే శేరిలింగంపల్లి ఇంచార్జ్ మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని సర్ ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ప్రతి బి ఎల్ ఏ అప్రమత్తంగా పనిచేయాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ఒక్క అర్హులైన ఓటరు పేరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు , నవతా రెడ్డి, విజయ్ రెడ్డి, నరేందర్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంథని లో అయ్యగారి చెరువు మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి





**మంథని, నేటి శుభోదయ :** మంథని పట్టణంలోని అయ్యగారి చెరువు సుందరీకరణ పనుల సందర్భంగా వెలికితీసిన మట్టిని అక్రమంగా వెంచర్లు, ఇటుక బట్టీలకు తరలిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.వారు మాట్లాడుతూ, చెరువు నుంచి జేసీబీల సహాయంతో వందలాది ట్రాక్టర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తూ సంబంధిత కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.సామాన్య రైతులు తమ వ్యవసాయ భూములకు మట్టి కావాలని పలుమార్లు దరఖాస్తు చేసినా అనుమతులు ఇవ్వలేదని, అదే సమయంలో భారీ ఎత్తున అక్రమంగా మట్టిని వెంచర్లకు తరలించడం అనుమానాలకు తావిస్తోందన్నారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల పేరుతో అక్రమ వెంచర్లలో డంప్ చేసిన మట్టి కుప్పలను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని, ఆ మట్టిని పేద రైతుల పొలాలకు ఉచితంగా తరలించి అందించాలని వారు డిమాండ్ చేశారు.అక్రమ మట్టి తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించిన మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి



**శేరిలింగంపల్లి, నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చందానగర్ బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి,కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బి.ఎల్. ఏ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలోఎమ్మెల్యేకృష్ణ రావు మాట్లాడుతూ ప్రధానంగా ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని.ఎప్పటికప్పుడు బి.ఎల్.ఎ, బి.ఎల్.ఓ లకు అందుబాటులో ఉండి ఏదైనా సమస్య ఉంటే వాటిని సరి చేయాలని సూచించడం జరిగినది.మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల ఎవరైనా అందుబాటులో లేనప్పుడు వారి సమాచారం సేకరించి తిరిగి మళ్లీబి.ఎల్.ఎ.బి.ఎల్.ఓ లకు వారి సమాచారం అందించి వారి ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని,ఓటు ప్రతి ఒక్కరి పౌరుహక్కని. ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఏమైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే తెలుసుకుని వారు ఇచ్చిన దరఖాస్తు నింపి ఇవ్వాలని ఇవన్నీ కూడా దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారుఈ కార్యక్రమంలోబి.ఆర్.ఎస్ పార్టీ నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వ విద్య ను సద్వినియోగం చేసుకోవాలి

**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** ప్రభుత్వ విద్య ను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, తహశీల్దార్ పి.రాంప్రసాద్ లు సూచించారు. మండలం లోని రాయగూడెం లో ఫ్రీ ప్రైమరీ సెక్షన్ ను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్య కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే ప్రోత్సాహకాలను పొంది... ప్రయోజకులు కావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్య ను అందిస్తుందన్నారు. పాఠశాల లను బలోపేతం చేసేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, కాంప్లెక్స్ హెచ్యం నరేందర్, పాఠశాల



ప్రధానోపాధ్యాయుడు జీ. నాగేశ్వరరావు, సర్పంచ్ వేణు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మేర యువ భారత్ లో యువ వాలంటీర్ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానం



**నిజామాబాద్, నేటి శుభోదయ :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల,క్రీడాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో (మై భారత్),మేరా యువ భారత్ నిజామాబాద్ జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసం,గ్రామీణ ప్రాంతాల్లో యువజన సంఘాల నిర్మాణం కోసం యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తు ఆహ్వానించడం అయినది.ఉమ్మడి నిజామాబాద్ కామారెడ్డి జిల్లాల మేరా యువ భారత్ అధికారి బి.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం,నైపుణ్యాలను మెరుగుపరచడం,ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లడం ప్రతి గ్రామంలో యువజన సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం,యువతకు సామాజిక సేవ వైపు తీసుకు వెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. అర్హత వయసు 18 నుంచి 29 సంవత్సరాల మధ్య ఉండాలి. విద్య అర్హత కనీసం పదో తరగతి ఉత్తీర్ణత నిజామాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలి సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉండాలి. దరఖాస్తు విధానం ఆసక్తిగల అభ్యర్థులు మై భారత్ అధికారిక పోర్టల్ https://mybharat.gov.in/pages/ny_corps_gjt కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకొని ఆన్లైన్ దరఖాస్తును సమర్పించాలని ఇందులో ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. చివరి తేదీ ఈ నెల 20 -07-2026 ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం 5000 రూపాయలు,రెండు సంవత్సరాల కాలం పాటు,ప్రతి మండలానికి ఇద్దరు యువ వాలెంటర్ లు అవసరం ఎంపిక విధానం ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది.శిక్షణ,సర్టిఫికెట్ అందజేయబడుతుంది. మరిన్ని వివరాలకు మేరా యువభారత్ నిజామాబాద్ కార్యాలయం ఫోన్ నెంబర్ 7780338076

## యాదాద్రి టెస్ట్ బోర్డ్ సభ్యురాలు పోచన బోయిన ఈశ్వరమ్మకు క్షమాపణ చెప్పాలి



**ఖమ్మం, నేటి శుభోదయ :** గత మూడురోజుల క్రితం ప్రముఖ సంగసేవకురాలు సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నికార్సైన నాయకురాలు తెలంగాణ రాష్ట్రానికి పెద్దమ్మ పోచనబోయిన ఈశ్వరమ్మ యాదవ్ , 80 సవంత్సరాల వృద్ధురాలిని అవమానించేవిధంగా కించపరిచిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చరణ్ రెడ్డిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలి , ఈశ్వరమ్మ యాదవ్ కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి . కనీసం మహిళా వృద్ధురాలు అనే విచక్షణ లేకుండా బీసీ సమాజాన్ని యాదవ సమాజాన్ని అవమానించిన చరణ్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీసీసీబీ మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఛైర్మెన్ , తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కురాకుల నాగభూషణం యాదవ్ , బిఆర్ఎస్ పార్టీ నగర మాజీ అధ్యక్షులు , తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు పగడాల నాగరాజు యాదవ్ , జిల్లా అధ్యక్షులు కోడిలింగయ్య యాదవ్ , ప్రధాన కార్యదర్శి గుమ్మ రోశయ్య యాదవ్ , సంఘం రాష్ట్ర నాయకులు ముదుముంతల గంగరాజు యాదవ్ , మహిళా అధ్యక్షురాలు ఇందుమతి యాదవ్ డిమాండ్ చేశారు . గోకుల కృష్ణ సేవాసమితి భవనం , మధురానగర్ ఖమ్మం లో బుధవారం జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు . యాదాద్రి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలుగా పోచ్నబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ని రాష్ట్ర ప్రభుత్వం నియమించడాన్ని సహించలేని , జీర్ణం చేసుకోలేని ఆధిపత్య వర్గాలు ఈశ్వరమ్మ యాదవ్ పై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు . యూత్ కాంగ్రెస్ నాయకులు చరణ్ రెడ్డి వాళ్ళ నాన్న ప్రభాకర్ రెడ్డి యాదవ్ సమాజాన్ని బీసీ సమాజాన్ని వారి ఎదుగుదలను సహించ లేక అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారు . గత సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి ఈశ్వరమ్మ చేసిన సేవలకు గుర్తుగా చిన్న పదవి ఇస్తే తట్టుకోలేక పోతున్నారు . అక్కసు వెళ్ళగక్కుతున్నారు . యాదవులకు పదవులు ఇస్తే జీర్ణించుకోలేక పోతున్నపుడు యాదవుల బీసీ ల ఓట్లు ఎందుకు అడుగుతున్నారని నాయకులు ప్రశ్నించారు . 2శాతం లేని రెడ్డి సామాజిక వర్గం 15 శాతం జనాభా కలిగిన యాదవ్ సమాజాన్ని అవమానిస్తే రాబోవు కాలంలో రాజకీయంగా సమాధి చేయడానికి యాదవులు సిద్ధంగా ఉన్నారని నాయకులు తెలియజేశారు . ఇప్పటికైనా చరణ్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి లను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని , అదేవిధంగా ఈశ్వర్మ యాదవ్ చాలా పెద్దమనిషి పైగా మహిళా అనే కనీస సంస్కారం లేకుండా మాట్లాడిన వీళ్ళు ఈశ్వరమ్మ యాదవ్ కి వెంటనే క్షమాపణ బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు . లేకపోతే రాబోవు కాలంలో యాదవులు బీసీ ఎస్సీ ఎస్టీ, ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమించి మీకు రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు . ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల సుగుణరావు యాదవ్ , మహిళా అధ్యక్షురాలు చిత్తూరు ఇందుమతి యాదవ్ , జల్లెల శ్రీనివాస్ యాదవ్ , సారిక రాము యాదవ్ , వల్లూరి తిరుపతి రావు యాదవ్ , చెవుల వెంకటేశ్వర్లు యాదవ్ , చిత్తారు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాగొన్నారు .

## మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

### -డివిజన్ అధ్యక్షులు ఎస్డి ఇంతియాజ్

**వరంగల్, నేటి శుభోదయ :** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ అన్నారు.బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ లోని మణికంఠ కాలనీలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు, డివిజన్ అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ పార్టీ కార్యకర్తలతో కలిసి పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా ఇతర మౌలిక వసతుల సమస్యలను డివిజన్ అధ్యక్షుడికి వివరించారు. ప్రజల సమస్యలను ఇంతియాజ్ శ్రద్ధగా విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లపై, వర్షపు నీటి నిల్వలు లేకుండా, అలాగే తాగునీటి కొరత తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా కాలనీలో తడి చెత్త పొడి చెత్త వేరు చేసి, ఇంటింటికి వచ్చే స్వచ్ఛభారత్ ట్రాలీలో వెయ్యాలని ప్రజలకు ఆవగాహన కల్పించారు. కాలనీలో డ్రైనేజీ కాలువలు నిండి ఉన్నట్టయితే శుభ్రపరచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే డ్రైనేజీ, విద్యుత్ ఇతర స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వివరిస్తానని అధికారుల సమన్వయంతో కలసి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు.తొలుత డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్,మణికంఠ కాలనీకి వచ్చిన సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ మణికంఠ కాలనీ గ్రామ శాఖ అధ్యక్షులు కంచ శ్రీనివాస్, మరియు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పోతు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాలనీవాసులతో కలిసి ఆయనకు స్వాగతం పలుకుతూ పూలబోకి అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కా



రమే తన ప్రధాన లక్ష్యమని ఇంతియాజ్ తెలిపారు. ఆయన ఒక వినూత్న సందేశాన్ని ఇస్తూ తనను కలిసే వారు శాలువాలు, బొకేలు తీసుకురావడం కంటే విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, పుస్తకాలు తీసుకు రావాలని శాలువాలు, బొకేలు వద్దు... పెన్నులు, పుస్తకాలే ముద్దు."అని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వెలిశాల రమేష్ బాబు,తో పాటు కాలనీ కమిటీ సభ్యులు,కాలనీవాసులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు."


## ప్రజా సమస్యలు పరిష్కారం చేయడం ద్వారా అధిక స్థానాల్లో గెలవాలి -పోతినేని సుదర్శన్

**ఖమ్మం, నేటి శుభోదయ :** గతంలో ఖమ్మం నగరంలో సమర్థవంతమైన పాలన అందించిన ఘనత సిపిఎం పార్టీకి వుంది అనీ, ప్రజలకు మరింత చేరువగా వుండటం ద్వారా వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పార్టీ గెలవడానికి చాలా అవకాశాలు ఉన్నాయి అని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. బుధవారం సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ ఖమ్మం డివిజన్ వర్క్ షాప్ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోతినేని సుదర్శన్ హాజరు అయి రాబోయే ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల కోసం క్యాడర్ కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్ గా చిర్రావూరి లక్ష్మి నర్సయ్య, ఆతర్వాత కాలంలో మరోసారి మున్సిపల్ ఛైర్మన్ గా సమీనా అఫ్రోజ్ చిత్తశుద్ధితో నిజాయితీగా అత్యంత సమర్థవంతంగా పరిపాలన చేశారు అని తెలిపారు. భవిష్యత్ ఖమ్మం నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆనాడే త్రాగు నీరు సౌకర్యం, విశాలంగా రహదారులు, తదితర మౌలిక సదుపాయాలు ఆ కాలంలోనే ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కల్పించారు అని తెలిపారు. ఈరోజు ఖమ్మం నగరంలో ఏ సమస్యలు వచ్చినా ప్రజల వైపు నిలబడి నిత్యం ఆందోళనలు చేయడం ద్వారా మరింతగా ప్రజలకు మరింత మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి సిపిఎం పార్టీ ఆందోళనలు ఒక ముఖ్యమైన కారణం అని తెలిపారు. ప్రజలతో మరింతా మమేకమై ప్రజా సమస్యలు పరిష్కారం రాబోయే ఎన్నికల్లో ద్వారా అధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థి లు కార్పొరేటర్ల గా గెలవడానికి తగిన ప్రణాళిక చేసుకోవాలి అని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలు గాలికి వదిలేసి దేశ సంపద అంతా అదానీ, అంబానీ లకు ధారాదత్తం చేసే పనిలో మోడీ బిజీగా ఉన్నారు అని విమర్శించారు. రోజూ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాలు పడుతున్నాయి అని ఆరోపించారు. రాబోయే కాలంలో మోడీ వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు విస్తృతంగా చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనువాసురావు, నాయకులు బండారు రమేష్, ఎం ఏ జబ్బార్, ఎస్ కే మీరా సాహిబ్, పి రమ్య, బోడపట్ల సుదర్శన్, ఎస్ కే నాగులు మీరా, ఉపేంద్రర్, పి నాగ సులోచన, మాజీ కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## చీకటిలో రాజీవ్ రహదారి - అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సాయిబాబా ఆలయ మార్గంస్ట్రీట్ లైట్లు లేక భయాందోళన..







**శామీర్‌పేట, నేటి శుభోదయ :** రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న సాయిబాబా ఆలయానికి వెళ్లే రహదారి రాత్రి వేళల్లో చీకటిమయంగా మారుతోంది. స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో ఈ మార్గం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడుబడిన వెంచర్లు, నిర్మానుష్య ప్రాంతాలను కొందరు దుర్వినియోగం చేస్తుండటంతో మహిళలు, పాదచారులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నట్లు చెబుతున్నారు.స్థానికుల కథనం ప్రకారం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, కార్లలో కొందరు వచ్చి బహిరంగంగా అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులు భవిష్యత్తులో నేరాలు, దాడులు, హత్యలు వంటి ఘటనలకు దారితీసే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాయిబాబా ఆలయానికి వచ్చే భక్తులతో పాటు రాజీవ్ రహదారిని వినియోగించే పాదచారులు, వాహనదారులు కూడా స్ట్రీట్ లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పూర్తిగా చీకటి అలుముకోవడంతో ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని చెబుతున్నారు. మరోవైపు, పాడుబడిన వెంచర్లలో కొందరు మద్యం సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు.ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు వెంటనే స్పందించి రహదారి వెంట స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, ప్రధాన వెంచర్ల యాజమాన్యాలు సీసీ కెమెరాలు అమర్చాలని, రాత్రి వేళల్లో పోలీసు మొబైల్ పెట్రోలింగ్‌ను పెంచి పాడుబడిన వెంచర్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జర్నలిస్టు కాలనీ వాసులు, స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, గడువు లోగా పూర్తి చేయాలి -ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, నేటి శుభోదయ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 8,48,491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 68.22 శాతం పురోగతికి సమానమని, ఇంకా 3,95,290 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు.ఇప్పటికే డిజిటలైజ్ చేసిన వివరాల్లో సుమారు 72 వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని, వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు.సుమారు 25 వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలను మాత్రమే సమర్పించి, అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారులు 85 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తి చేయగలరని, అయితే 100 శాతం పూర్తి కావాలంటే ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఆన్లైన్ ద్వారా కూడా ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా ఫారం అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్వోను సంప్రదించి ఫారం తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, అధికారులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, మంకెన రమేష్, కె. వెంకట్ రావు, బిఆర్ఎస్వి ప్రతినిధి లింగనబోయిన సతీష్ బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఎం పార్టీ ప్రతినిధి సీహెచ్. వెంకటేశ్వర్లు, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర ప్రారంభం సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర



**హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ :** ఆషాఢ మాసం బోనాల జాతర ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.చారిత్రిక ప్రాధాన్యత గల గోల్కొండ కోటలో కొలువైన శ్రీశ్రీశ్రీ జగదాంభిక మహంకాళి అమ్మవారికి గురువారం భక్తులు తొలి బోనం సమర్పించడంతో ఈ జాతర ప్రారంభమవుతుందన్నారు.ఆ తర్వాత లష్కర్ (సికింద్రాబాద్ మహంకాళి),బల్కంపేట ఎల్లమ్మ,పాతబస్తీ లాల్ దర్వాజ తదితర చోట్ల బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర తెలిపారు.బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని,భక్తి సంప్రదాయాలు,విశ్వాసాలకు నిలువెత్తు నిదర్శనమని ఆయన చెప్పారు.ఇదొక పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే, విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే జానపద, ఆధ్యాత్మిక వేడుక అని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.బోనాల జాతరలో భాగంగా వినిపించే భవిష్యవాణి, జరిగే పోతురాజుల విన్యాసాలు,శివసత్తుల పూనకాలు,ఘట్టాల ఊరేగింపులు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతాయన్నాయని వివరించారు.తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన ఈ పండుగ విశిష్టత రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా, కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో ప్రపంచం నలుమూలలకు వ్యాప్తిచెంది మరింత ప్రాచుర్యం పొందిందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.గోల్కొండ కోటలో తొలి బోనంతో మొదలై సుమారు సుమారు 45 రోజుల పాటు జరిగే ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో కలిసి భక్తిప్రపత్తులతో జరుపుకోవాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరుతూ తెలంగాణ బిడ్డలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## కొత్తూరులో అగ్నిప్రమాదం -రూ. 5 లక్షల నష్టం

### -గడ్డివాము నుంచి వ్యాపించిన మంటలు కొత్తూరు ప్లంబర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం





**షాద్నగర్, నేటి శుభోదయ :** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదవశాత్తు చెలరేగిన ఈ మంటల్లో ఒక ప్లంబింగ్ గోదాం పూర్తిగా కాలిబూడిదైంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని బాబూలాల్ గోదాం వద్ద ఉన్న గడ్డివాముకు ఒక్కసారిగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గడ్డి ఎండిపోయి ఉండటంతో నిమిషాల వ్యవధిలోనే మంటలు తీవ్రరూపం దాల్చాయి. ఆ గడ్డివాము పక్కనే ఉన్న ఓం ప్రకాష్ అనే వ్యక్తికి చెందిన ప్లంబర్ గోదాంకు ఈ మంటలు వేగంగా వ్యాపించాయి. గోదాంలో ప్లాస్టిక్ పైపులు, ఇతర సామాగ్రి భారీగా ఉండటంతో మంటలు ఆకాశాన్నంటాయి. చుట్టుపక్కల దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది, స్థానికులతో కలిసి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. వెంటనే స్పందించడంతో చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా పెద్ద ప్రమాదం తప్పింది.ఈ ప్రమాదంలో ప్లంబర్ గోదాంలో ఉన్న విలువైన సామాగ్రి అంతా కాలి బూడిదైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు ఐదు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## క్యూ లె క్స్ న్యూసెన్స్ దోమల పై డ్రోన్ యుద్ధం

### - గుర్రపు డెక్క తొలగింపు కోసం ఆధునిక యంత్రాలు త్వరలో టెండర్లు.



**రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :** మూసీ నదిలో మళ్లీ పెట్రేగిపోతున్న గుర్రపు డెక్క, రక్తాన్ని పీల్చే క్యూలెక్స్ న్యూసెన్స్ దోమలను నివారించడానికి జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోన్ అధికారులు డ్రోన్ యుద్ధం ప్రకటించారు.బుధవారం ఉదయం సీనియర్ ఎంటమాలజీ అధికారి గంగప్ప ఆధ్వర్యంలో డ్రోన్ ఆపరేషన్ జరిగింది.డ్రోన్ ద్వారా అత్తాపూర్ నుంచి బాపు ఘాటు వరకు ఉన్న మూసీ నది తీర ప్రాంతంలో మస్కిటో లార్వి సైడ్ ఆయిల్ ను స్ప్రే చేశారు.గుర్రపు డెక్కన్ పూర్తిగా తొలగించి క్యూలెక్స్ దోమలను నివారించడానికి అవసరమైన ఆధునిక యంత్ర సామాగ్రిని సమకూర్చుకుంటున్నట్లు సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్ప వెల్లడించారు.ఫ్లోటేడ్ ట్రాష్ కలెక్టర్,హిటాచి యంత్రాలను కొనుగోలు చేయడానికి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.గుర్రపు డెక్క చాటున పెరిగే టూ క్యూలెక్స్ దోమలు రక్తాన్ని పీల్చి న్యూసెన్స్ సృష్టిస్తాయి తప్ప రోగాల వ్యాప్తిని కలుగ చేయదని సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్ప స్పష్టం చేశారు.

## ఖమ్మం లో మెగా వర్క్ షాప్ విజయ వంతం -వెంకట్



**ఖమ్మం, నేటి శుభోదయ :** బుధవారం ఖమ్మం నగరంలో టౌన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిజిటెక్కు కంపెనీ వారి మెగా వర్క్ షాప్ నగరంలో టీటీడీసీ ఫంక్షన్ హాల్ ఇల్లందు క్రాస్ రోడ్ లో,అడ్వాన్సుడ్ టెక్నాలజీ లెన్సు, లైట్ల గురించి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కి సుమారుగా 120 మెంబెర్స్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఎస్కే హుస్సేన్, జిల్లా అధ్యక్షులు వెంకట్, ట్రెజరర్ తిరుపతి రావు, టౌన్ అధ్యక్షులు మేఘన శ్రీను,సెక్రటరీ వడ్డేటి సుధాకర్,ట్రెజరర్ బట్టు ఉపేందర్, గౌరవ అధ్యక్షులు బండారు శేషగిరిరావు, వెంకట్రావు,వైస్ ప్రెసిడెంట్ అమర్ చందు, సంజీవరావు, పగలా ఉపేందర్, కొండమీద వెంకట్ సాగర్,వర్క్ షాప్ లో తదితరులు పాల్గొన్నారు.

## "ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి.. సర్ ప్రక్రియను విజయవంతం చేయాలి"

### — షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్నగర్, నేటి శుభోదయ :** ఫరూక్నగర్లోని పలు వార్డుల్లో సర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యేషాద్నగర్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 13, 14 వార్డులతో పాటు బూత్ నెంబర్లు 227, 228, 231, 234లలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ల వద్ద ఓటర్లతో మాట్లాడి, ఎన్యూమరేషన్ ఫారాల నమోదు, వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై ఆరా తీశారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల సంఘం సూచించిన విధంగా సర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, బీఎల్ఓలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు సర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రజలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్లు దిలీప్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్ఓలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "షాద్‌నగర్ అభివృద్ధే నా ధ్యేయం.. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం"



**షాద్నగర్ , నేటి శుభోదయ :** పట్టణంలోని ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డులో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫరూక్‌నగర్ అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే షాద్‌నగర్ పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్ఓలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్, శ్రీజ లకు ప్రజల ప్రశంసలు



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన ఓ అత్యవసర పరిస్థితిలో అధికారులు మానవత్వంతో స్పందించి ఒక అధికారికి సకాలంలో వైద్య సహాయం అందించారు.విషయంలోకి వెళితే ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలానికి చెందిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ (ఏఈ)కు కలెక్టరేట్‌లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు లక్షణాలు కనిపించాయి. ఈ విషయాన్ని గమనించిన లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ శ్రీజ వెంటనే స్పందించి, అక్కడే విధుల్లో ఉన్న సీహెచ్‌వో డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తో కలిసి అత్యవసర వైద్య సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తక్షణ చికిత్స అందించడంతో బాధిత అధికారికి ప్రాథమిక వైద్య సహాయం సకాలంలో లభించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, అదనపు కలెక్టర్ శ్రీజ చూపిన అప్రమత్తత, మానవత్వాన్ని అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమయానికి స్పందించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం కలిగిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వడ్డీ వ్యాపారుల అక్రమ దందా ప్రైవేట్ వ్యక్తులచే డబ్బులు వసూలు



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ,మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న వడ్డీ వ్యాపారం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. వడ్డీ వ్యాపారుల అరాచకాలు అంతా ఇంత కాదు చాలా ఇబ్బందులకు గురిచేస్తూ వారు చెప్పినట్టు డబ్బులు కడితే మంచిది లేదంటే వారిని నట్టేట ముంచే స్తున్నారు. ఈ ప్రాంతంలో వడ్డీ వ్యాపారులని ఆడింది ఆట పాడింది పాటగా కొనసాగుతుంది. ఈ తంతు అడిగే నాథుడే కరువయ్యారు. నారాయణఖేడ్ ప్రాంతంలో జోరుగా వడ్డీ వ్యాపారాలు ఇచ్చేటప్పుడు ఒక మాట డబ్బులు ఇచ్చినంక ఇంకొక మాట మాట్లాడి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఆపద ఉన్నప్పుడు ఎవరి అవసరాలకు వారు డబ్బులు తీసుకుంటారు. అదే ఆసరా చేసుకుని వడ్డీ వ్యాపారులు ఇష్టరాజంగా సామాన్యుడి దగ్గర నిలువు దోపిడీ చేస్తున్నారు. డబ్బులు కడతారా కట్టండి లేదంటే ఇంటి దగ్గరికి ప్రైవేట్ గుండాలను తీసుకు వచ్చి గొడవలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదు చాలా కుటుంబాలు రోడ్డున పడ్డారు. బాధితులు ఇంత వడ్డీ వసూలు చేస్తున్నారు అని అడిగితే అది నా ఇష్టం అంటూ మీరు ఎవరికి చెప్పకుంటే వారికి చెప్పుకోండి నూటికి 3 రూపాయలు లేదా 4, 5 రూపాయలు వడ్డీలు వసూలు చేస్తూ చాలా కుటుంబాలు సర్వనాశనం అయిపోయి రోడ్డున పడ్డారు. బాధితులు ఎవరికి చెప్పుకుందామన్న భయంతో చెప్పుకోలేకపోతున్నారు. ఇదే ఆసరా చేసుకుని పలు కుటుంబాల ఇంటి దగ్గరకు వెళ్లి బెదిరింపులకు గురి చేస్తున్నారు. నారాయణఖేడ్ లో చాలామంది వడ్డీ వ్యాపారం చేస్తూ బాధితుల రక్తం తాగుతున్నారు. వడ్డీ వ్యాపారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు ఈ వడ్డీ వ్యాపారులపై జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోకపోతే చాలా మంది కుటుంబాలు ఆత్మహత్య శరణం అంటూ బాధితులు వాపోతున్నారు. వడ్డీ వ్యాపారులు వడ్డీ వ్యాపారం చేస్తూ పెద్ద పెద్ద బిల్డింగులు కడుతున్నారు. కొందరు వ్యక్తులు పట్టాదారులపై భూములు రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా వడ్డీ వ్యాపారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయండి -ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం, నేటి శుభోదయ :** వైరా నియోజక వర్గంలోని కొణిజర్ల మండలం అంజనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రాంగణం, సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, పనిచేసి ప్రతి ఏర్పాటును ముందస్తుగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు, ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.సభా ప్రాంగణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, మీడియా ప్రతినిధులు, ప్రజల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక కూర్చునే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్యారికేడింగ్, సూచిక బోర్డులు, తగినంత వెలుతురు, తాగునీటి సదుపాయం, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు శాఖకు సూచిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బహుస్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.హెలిప్యాడ్ నుండి సభా ప్రాంగణం వరకు ప్రయాణ మార్గాలను ముందుగానే పూర్తిస్థాయిలో పరిశీలించి, రహదారుల మరమ్మతులు, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పూర్తి చేయాలని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసి, ప్రజలకు ముందస్తుగా సమాచారం అంభద్రని సంబంధిత అధికారులను ఆదేశించారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్సులు, వైద్య బృందాలు, అత్యవసర చికిత్సా కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక శాఖ ఫైర్ టెండర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వ్యర్థాల తొలగింపు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం రాష్ట్రంలో పామాయిల్ సాగు అభివృద్ధికి ప్రోత్సాహకరంగా నిలుస్తుందని ఈ కార్యక్రమం ద్వారా రైతులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అందుకు తగిన విధంగా రైతుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.సభా ప్రాంగణంలోని ప్రతి విభాగాన్ని సంబంధిత శాఖల అధికారులు స్వయంగా పరిశీలించి, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి, అప్పగించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, రవాణా, మున్సిపల్, వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమల శాఖల అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు సమీపించిన గడువు

### - త్వరితగతిన ఫారంలను బీ.ఏల్.ఓలకు అందజేయాలి కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, నేటి శుభోదయ**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు.అంతేకాకుండా ఆబ్సెంట్,షిఫ్టెడ్,డెత్ డిలీటెడ్ (ఏ.ఎస్.డీ)ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఎన్యూమరేషన్ ఫారాలను బీ.ఎల్.ఓలకు అందించాలని అన్నారు.ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతు అవుతుందని తెలిపారు.ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారీగా నెలకొల్పిన హెల్ప్ డెస్క్ ను,లేదా బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు.అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపరచి ఫారం సమర్పించవచ్చని అన్నారు.అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు.వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈ.ఆర్.ఓ) నోటీసు జారీ చేసే హియరింగ్ కు పిలుస్తారని,ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు ధృవీకరణ పత్రాలలో ఏదైనా ఒక దానిని చూపిస్తే ఓటరు తుది జాబితాలో పేరు చేరుస్తారని అన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని



ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందజేయాలని కలెక్టర్ సూచించారు.ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ఉంటూ క్రియాశీలక పాత్ర పోషించాలని,ప్రతి రోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఫారంలు సేకరించి బీ.ఎల్.ఓలకు అందించేలా చొరవ చూపాలన్నారు.ఈ.ఆర్.ఓలు,ఏ.ఈ.ఆర్.ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ,ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ,వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందుబాటులో లేని,చనిపోయిన,శాశ్వతంగా వలస వెళ్ళిన,రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించి,వాటిపై బీ.ఎల్.ఏల సంతకాలు తీసుకోవాలన్నారు.

## నిజామాబాద్ నుండి యూ.కేకు బియ్యం ఎగుమతులు

### - లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

**నిజామాబాద్, నేటి శుభోదయ :** భారత్–యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక,వాణిజ్య ఒప్పందం (Compre–hensive Economic Trade Agreement – CETA) ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది.ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు.ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం




ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు,ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి,ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్,గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెసొనెన్స్ జూనియర్ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డ్ పర్మిషన్ ఎక్కడ.?

- రెసొనెన్స్ కళాశాల అంటే అధికారులకు కాసుల పంట.?
- ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు కానీ ముడుపులకు రెసొనెన్స్ ఇచ్చే దానికి దాసోహం.
- నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలోనే పాఠ్యపుస్తకల విక్రయం.
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నా నిమ్మకుడి పోతున్న లంచాల అధికారులు..?
- రెసొనెన్స్‌పై కలెక్టర్ దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు,తల్లిదండ్రుల డిమాండ్
- అందుబాటులోకి రాని డిఐఈవో అధికారికి ఎంత ముట్టింది.



రెసోనెన్స్ కళాశాల భవనం కింద వ్యాపారసముదయాలు

**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :** భహిరంగ సభలలో గొప్పలు,నీతులు వలకబోసే యంత్రాంగం మాములకు అలవాటు పడి విద్యార్థుల భవిష్యత్ గాలిలో దీపంలా వేలాడుతున్న మకెందుకులే అని గప్ చుప్ సంబర్భుడి అనే దోరణిలో వ్యారించడం తల్లి దండ్రులకు ముచ్చెమటలు ప డుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే..రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోన్ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫార్మ్ వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా రెసొనెన్స్ జూనియర్ కళాశాలను నిర్వహిస్తూ తల్లిదండ్రుల విద్యార్థులకు కుచ్చుటోపి పెడుతున్న యాజమాన్యం.ఈ కళాశాలకు బిల్డింగ్ అనుమతులే కాదు కదా



అసంపూర్తిగా ఉన్న కళాశాల లోపల దృశ్యం

విద్యాశాఖ ఇంటర్ బోర్డ్ నుండి కూడా ఎలాంటి సరైన అనుమతులు లేకుండానే లక్షల్లో ఫీజులు దండుకుంటూ,నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలోనే పాఠ్యపుస్తకలను విక్రయిస్తూన్నారు.ఈ కళాశాలపై తెలంగాణ సామాజిక స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ గౌడ్ పలుమార్లు విద్యాశాఖకు ఫిర్యాదు చేసిన పలు పత్రికల్లో కథనాలు వచ్చిన అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా డిఐఇఓకు ఫిర్యాదు చేసేందుకు చేరవాణిలో సంప్రదించగా ఫోన్ ఎత్తి సమాధానం చెప్పిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు.రెసోనెన్స్ కళాశాల యాజమాన్యంతో డిఐఈఓ కుమ్మక్కు అయి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ లక్షల్లో ఫీజులు దోచుకుంటూ న్నారని బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు.ఫిర్యాదులకు స్పందించకుండా చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తూ యాజ మాన్యానికి సహకరిస్తూ విద్యార్థుల జీవితాల్లో చెలగాటమాడుతున్న డిఐఈఓపై,జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం డిమాండ్ చేస్తున్నారు.

# నాడు గురుదేవోభవ... నేడు నిర్లక్ష్య వైఖరి

– ఆధునిక సమాజంలో గురు–శిష్య బంధంపై సీనియర్ జర్నలిస్ట్ "డాక్టర్ సునీల్ కుమార్ యాంద్ర" కలం నుంచి ఒక విశ్లేషణాత్మక కథనం.

నిరంతరం ప్రవహించే జీవనది లాంటిది గురు శిష్యుల బంధం. చీకటిని చీల్చుకుంటూ వచ్చే వెలుగు రేఖలాం టివాడు గురువు. అజ్ఞానమనే అంధకారం నుంచి జ్ఞానమనే వెలుగు వైపు నడిపించే పరమ పవిత్రమైన మూర్తి. భారతీయ సంస్కృతిలో గురువుకు భగవంతుడికంటే ఉన్నతమైన స్థానాన్ని ఇచ్చాం. కానీ, మారుతున్న కాలంతో పాటు నేటి ఆధునిక సమాజంలో ఈ బంధం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

నేడు గురుపౌర్ణమి పర్వదినం. ఈ పవిత్రమైన రోజున నేటి సమాజంలో యువత ప్రవర్తన, గురువుల పట్ల పెరుగుతున్న అగౌరవం, దాని వెనుక ఉన్న సామాజిక కారణాలపై ఒక లోతైన విశ్లేషణ...

– విలువల క్షీణత – ఇష్టానుసార ప్రవర్తన

నేటి యాంత్రిక జీవనంలో నైతిక విలువల కంటే భౌతిక సుఖాలకే ప్రాధాన్యత ఎక్కువైంది. ఒకప్పుడు గురువు కనిపిస్తే చేతులు జోడించి నమస్కరించే సంస్కృతి ఉండేది. కానీ నేడు చాలా చోట్ల గురువులను కనీసం మనుషులుగా కూడా గౌరవించని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

తరగతి గదుల్లో ఉపాధ్యాయులపై హేళనలు చేయడం.

సామాజిక మాధ్యమాలలో గురువులను ట్రోల్ చేయడం, వారిని కించపరుస్తూ వీడియోలు పెట్టడం.

తమ తప్పులను గురువులు మందలిస్తే, వారిపై ఎదురుదాడికి దిగడం లేదా సోషల్ మీడియాలో వారిపై అపవాదులు వేయడం నేటి యువతలో ఎక్కువవుతోంది.

– మార్కుల వేట – వ్యాపారీకరణ

విద్య అనేది నేడు ఒక జ్ఞాన సాధనంగా కాకుండా, కేవలం మార్కులు, ర్యాంకులు సంపాదించే ఒక వ్యాపార వస్తువుగా మారిపోయింది.

కొనుగోలు మనస్తత్వం : తాము ఫీజులు కడుతున్నాం కాబట్టి ఉపాధ్యాయులు తమకు సేవకులు మాత్రమే అనే అహంకారం కొందరు విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో పెరుగుతోంది.

ర్యాంకుల ఒత్తిడి : విద్యాసంస్థలు కూడా ఉపాధ్యాయులను కేవలం సిలబస్ పూర్తి చేసే యంత్రాలుగా చూస్తున్నాయి తప్ప, విద్యార్థులకు సంస్కారాన్ని నేర్పే మార్గదర్శకులుగా గుర్తించడం లేదు.

– గురువుల మనోవేదన

విద్యార్థుల నుంచి ఎదురవుతున్న ఈ అగౌరవ, బాధ్యతారహిత ప్రవర్తన వల్ల ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక వేదనకు, అవమాన భారానికి గురవుతున్నారు.

"తాము ఎంతో భవిష్యత్తును ఇవ్వాలని తపించే విద్యార్థులే తమను అవమానిస్తుంటే, గురువుల ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. ఇది కేవలం ఒక ఉపాధ్యాయుడి వ్యక్తిగత అవమానం కాదు, సమాజం సాధిస్తున్న తిరోగమనానికి సంకేతం."

శిక్షించడమో లేదా గట్టిగా మందలించడమో చేస్తే చట్టపరమైన, సామాజికపరమైన ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో చాలా మంది ఉపాధ్యాయులు నేడు కేవలం తమ విధులను నిర్వర్తించి మౌనంగా ఉండిపోతున్నారు. దీనివల్ల నష్టపోయేది ఉపాధ్యాయులు కాదు, సంస్కారం లేని తరాన్ని తయారుచేస్తున్న సమాజమే.

– మార్పు ఎక్కడ రావాలి..?

ఈ దుస్థితి మారాలంటే కేవలం యువతను బ్లేమ్ చేస్తే సరిపోదు. వ్యవస్థలో, ఆలోచనా విధానంలో మార్పు రావాలి.

తల్లిదండ్రుల పాత్ర : ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలకు మార్కులతో పాటు, గురువులను ఎలా గౌరవించాలో ఇంట్లోనే నేర్పించాలి. ప్రథమ గురువులైన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా ఉంటే, పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు.

నైతిక విద్య : విద్యావ్యవస్థలో కేవలం సబ్జెక్టులే కాకుండా, నైతిక విలువలు, గురు–శిష్యుల అనుబంధాన్ని తెలిపే పాఠ్యాంశాలను చేర్చాలి.

యువత ఆలోచించాలి : గూగుల్ సమాచారాన్ని ఇవ్వగలదు కానీ, జీవితాన్ని ఎలా జీవించాలో నేర్పే 'సంస్కారాన్ని' కేవలం గురువు మాత్రమే ఇవ్వగలడని యువత గ్రహించాలి.

గురువులను గౌరవించడం అంటే మన సంస్కృతిని మనం గౌరవించుకోవడమే. ఒక సమాజం వైభవోపేతంగా వర్ధిల్లాలన్నా, ఒక దేశం గొప్పగా నిలబడాలన్నా అక్కడ గురువులకు అత్యున్నత గౌరవం దక్కాలి. ఈ గురుపౌర్ణమి సందర్భాన్నైనా పురస్కరించుకుని నేటి యువత తమ ఇష్టానుసార వైఖరిని వీడి, గురువుల పట్ల కృతజ్ఞతా భావాన్ని, వినయాన్ని అలవర్చుకోవడమే మనం వారికి ఇచ్చే నిజమైన గురుదక్షిణ.



- డాక్టర్ సునీల్ కుమార్ యాంద్ర
MA, MCJ, PhD
సీనియర్ జర్నలిస్ట్

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**కేశంపేట, నేటి శుభోదయ :** కేశంపేట మండలం లేమామిడి గ్రామ పరిధిలోని నాను తండాకు చెందిన జర్పులవత్ లక్షి ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని ఎన్నారై గోగు వెంకట్ నారాయణరెడ్డి బుధవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్లిష్ట సమయంలో వారికి అండగా నిలుస్తూ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. గోగు వెంకట్ నారాయణరెడ్డి అందించిన సహాయానికి మృతురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు ఆయన సేవాభావాన్ని, మానవతా దృక్పథాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సులోచన శ్రీను, మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జగత్ రెడ్డి, భాస్కర్ నాయక్, అంజి నాయక్, పత్య నాయక్, నారం రెడ్డి, బద్రు నాయక్, బిల్యా నాయక్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్ఐ శ్రీనివాసరావు



**ఏన్కూరు, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిధి లోని లింగన్నపేట గ్రామంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు పావని, సింధుతో కలిసి ఇంటింటికీ సేకరిస్తున్న ఓటరు వివరాలు, నమోదవుతున్న దరఖాస్తులను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు.బీఎల్‌వోలు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని, ప్రతి ఓటరు వివరాన్ని క్షుణ్ణంగా ధృవీకరించి నమోదు చేయాలని ఆర్ఐ సూచించారు. నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని, విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియలో పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని బీఎల్‌వోలకు సూచించారు.

# చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ సంత్వేల్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ..



**వనపర్తి, నేటి శుభోదయ :** చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలోని సంతు వెల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గుర్తుతెలియని దుండగులు కాపర్ వైర్లను చోరీ చేశారు. ఈ ఘటనతో పెద్దమారూర్, చిన్నమారూర్, వెల్లటూర్, కొప్పునూరు గ్రామాలకు చెందిన సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే వర్క్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాషువా, ఇరిగేషన్ శాఖ అధికారి కవిత సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని సుమారు వెయ్యి లీటర్ల ఆయిల్‌ను బయటకు వదిలేసి, దాదాపు రూ,,14 లక్షల విలువైన కాపర్ వైర్‌ను దుండగులు అపహరించినట్లు అధికారులు తెలిపారు. ఘటన స్థలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దుండగులను గుర్తించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసరంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ల చోరీ జరగడం మూడోసారి కావడం గమనార్హం. వరుస చోరీలతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంపతారా చెట్లను తొలగించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ ఘటన స్థల పరిశీలనలో లైన్‌మెన్ ఈశ్వరయ్య, నరేష్, లిఫ్ట్ సిబ్బంది సాయి, రాము, తిరుపతి, లష్కర్లు వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్ రెడ్డి, బాలయ్య, ఆంజనేయులు, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గన్నారం గ్రామంలో సామాజిక బహిష్కరణ ఆరోపణలపై సమీక్ష నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ చైర్మన్





**నిజామాబాద్, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ గౌరవనీయులైన చైర్మన్ బక్కి వెంకటయ్య,కమిషన్ గౌరవ సభ్యులు రాంబాబు నాయక్ తో కలిసి నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారం గ్రామాన్ని సందర్శించారు.గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న సామాజిక బహిష్కరణ అంశంపై క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించిన అనంతరం,సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాధితులకు న్యాయం జరిగేలా చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని,సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గౌరవ చైర్మన్,గౌరవ సభ్యులు డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి,విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అందుతున్న విద్యా,వసతి మరియు ఇతర సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్,జిల్లా రెవెన్యూ అధికారి,డిప్యూటీ కలెక్టర్,అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్,షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు,ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

## - జిల్లా విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్, నేటి శుభోదయ :** ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని,అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు.జిల్లాలో ఉత్తీర్ణత మెరుగుపడిందని,ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం జిల్లా విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలలు,రెసిడెన్షియల్ స్కూళ్ళు,గురుకులాల నిర్వహణ తీరుతెన్నులు,సాధించిన ఫలితాలు,మౌలిక సదుపాయాల స్థితిగతులు తదితర అంశాలపై సమీక్ష జరిపి,అధికారులకు దిశా నిర్దేశం చేశారు.విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని,ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారని అన్నారు.విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.ఒక్కో విద్యా సంస్థకు 200 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని,ఇవి కాకుండా అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మిస్తోందని గుర్తు చేశారు.యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా సాంకేతిక విద్యకు తోడ్పాటును అందిస్తోందని అన్నారు.ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ బాధ్యతను గుర్తెరిగి నాణ్యమైన విద్యను బోధిస్తూ,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు.అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశాలు గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు.ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు.ఆయా సబ్జెక్టులలో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి,ప్రత్యేక తరగతులు నిర్వహించాలని,నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు.పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము కృషి చేస్తామని,విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన,క్రమశిక్షణ,నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత మాత్రం ఉపాధ్యయులదేనని స్పష్టం చేశారు.పీఎంశ్రీ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వెనక్కి మళ్లిపోకుండా,ప్రతి పైసా వినియోగంలోకి వచ్చేలా నిర్దిష్ట గడువులోగా అదనపు తరగతి గదులు,ఇతర సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.... విద్యా రంగంలో నిజామాబాద్ జిల్లా పనితీరు సంతృప్తికరంగా ఉందని అన్నారు.ప్రభుత్వ బడులలో విద్యార్థుల





ప్రవేశాల విషయంలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ఐదవ స్థానంలో ఉందని,ఈ నెలాఖరు వరకు లక్ష్యానికి అనుగుణంగా ప్రవేశాలు పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలుపుతామని తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 21శాతం మేర ఎక్కువ ప్రవేశాలు జరిగాయని,నెలాఖరు నాటికి మరో 7శాతం ప్రవేశాలు పెంపొందించేలా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.వసతి గృహాలు,రెసిడెన్షియల్ పాఠశాలలను మండల స్పెషల్ ఆఫీసర్లు,ఆర్.సీ.ఓలు,జిల్లా అధికారులు సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. విద్యార్థిని,విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయించామని తెలిపారు.బాలికల విద్యాలయాల్లో విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.మెరుగైన విద్యా బోధన అందించడం వల్ల ఈసారి పదవ తరగతిలో కేజీబీవీ, జ్యోతిబాపూలె, ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.ఈ సందర్భంగా ఎస్సెస్సీ లో టాపర్లుగా నిలిచిన లహరిక, సౌజన్య, సంజన, లాస్య, అభిజ్ఞ తదితరులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించగా,ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తన తరపున ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు పారితోషికం అందించి ప్రోత్సహించారు.ప్రభుత్వ బడులలో విద్యార్థులు ప్రవేశాలను పెంపొందించేందుకు కృషి చేసిన ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సైతం సన్మానించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,అదనపు కలెక్టర్ భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్,నూడా చైర్మన్ కేశ వేణు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం చైర్మన్ శేఖర్ గౌడ్,డీ.ఈ.ఓ అశోక్,డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్,విద్యా శాఖ అధికారులు, ఆర్.సీ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక సమస్యలు..

- మరమ్మతులపై దృష్టి సారించాలి..
- వచ్చే సమావేశానికల్లా పరిష్కరించాలి..
- హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీసమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్...






**నిజామాబాద్, నేటి శుభోదయ :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.జిల్లా జనరల్ ఆసుపత్రి డెవలప్మెంట్ సొసైటీ సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఆసుపత్రిలోని ప్రతి విభాగం అధికారులు సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.ప్రధానంగా వైద్యులు హాజరు విషయంలో రాజీ పడేది లేదని,ప్రతి ఒక్కరు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు.ఆసుపత్రిలో సివిల్ వర్క్ సమస్యలు అనేకంగా నెలకొన్నాయని,వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.చాలా సమయాల్లో ల్యాబ్,ఎక్స్ రే తదితర వాటికోసం వచ్చే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.అలాగే కొందరు కిందిస్థాయి సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.ప్రతి విభాగాధిపతి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాలన్నారు.అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ రోగులకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.వచ్చే సమావేశానికల్లా సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు.ప్రధానంగా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి,రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి,మేయర్ కూరగాయల ఉమారాణి,డిఎంహెచ్వో రాజశ్రీ,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఓటే ఆయుధం - సర్ అనేది మోసపూరిత కుట్ర

## - వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**ఏన్కూర్, నేటి శుభోదయ :** అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏన్కూరు మండల కేంద్రంలో కమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో కలిసి ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... పశ్చిమబెంగాల్లో 90 లక్షల ఓట్లు పోయాయని దీంతో మమతా బెనర్జీ ఓడిపోయారని అదేవిధంగా మన రాష్ట్రంలో జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏన్కూరు మండలంలో మొత్తం 28,104 ఓట్లు ఉండగా, ఇంకా 7,315 ఓట్ల పరిశీలన పెండింగ్‌లో ఉందని పేర్కొంటూ, సమయం తక్కువగా ఉన్నందున యుద్ధప్రాతిపదికన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కేసుపల్లి గ్రామ బీఎల్ఓ బి. శంకర్ తనకు కేటాయించిన 1,175 ఓట్లలో 1,171 ఓట్ల పరిశీలన పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే నాచారం గ్రామ బీఎల్ఓ, పంచాయతీ కార్యదర్శి ఉషారాణి 91 శాతం పరిశీలన పూర్తి చేయడాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.తహసీల్దార్ సిహెచ్. శేషగిరిరావు మాట్లాడుతూ... ఎలాంటి అవకతవకలకు తావులేకుండా



పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఫారాల పరిశీలనలో బీఎల్ఓలు జాగ్రత్తగా వ్యవహరించాలని, బీఎల్ఏలతో సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్, సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలూ నాయక్, గాలి బ్ మాజీ ఎంపీటీసీ మేడా ధర్మారావు, జిల్లా కార్యదర్శి సామేలు, ముక్తి వెంకటేశ్వర్లు, మాలోతు నరసింహారావు,వాసిరెడ్డి నాగేశ్వరరావు, చిన్న స్వామి, సురేష్ నాయక్, ప్రవీణ్ కుమార్, వక్కంతుల సాగర్, పంతగాని నరేష్, సాయి రోహిత్, దళపతి భువనేశ్వర్ రాజు, జాస్తి జనార్ధన్, గుర్రం రవి, నన్నే ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు, మండల పరిధిలోని బీఎల్ఓలు, బీఎల్ఏలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# 'సర్వజ్ఞ' లో వైభవంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ

## (విద్యార్థి నాయకుల పదవీ స్వీకారోత్సవం)

**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల సర్వజ్ఞలో విద్యార్థి సంఘం నూతన విద్యార్థి నాయకుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా, క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో జరిగింది. విద్యార్థుల్లో నాయకత్వ పటిమను, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కేవలం చదువు మాత్రమే కాకుండా, విద్యార్థులు సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఇలాంటి నాయకత్వ బాధ్యతలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పదవులు అనేవి కేవలం గౌరవం కోసం కాదని, అవి క్రమశిక్షణకు, సేవకు నిదర్శనాలని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.పాఠశాల డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ నాయకుడిగా ఎదగడం అంటే ఇతరులపై అధికారం చలాయించడం కాదు, అందరినీ కలుపుకొని సరైన మార్గంలో నడిపించడమని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులందరూ పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నట్లు ఆమె ఆకాంక్షించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు చైర్మన్,



డైరెక్టర్ లు బ్యాడ్జీలను, సాష్లను తొడిగి అభినందించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.స్కూల్ పీపుల్ లీడర్, అసిస్టెంట్ స్కూల్ పీపుల్ లీడర్ లతో పాటు పాఠశాలలోని వివిధ హౌస్లకు సంబంధించిన హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు కూడా ఈ కార్యక్రమంలో ఎంతో నిబద్ధతతో ప్రమాణ స్వీకారం చేశారు. తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, పాఠశాల క్రమశిక్షణకు కట్టుబడి ఉంటామని విద్యార్థి నాయకులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం, విద్యార్థులు పాల్గొని నూతన నాయకులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# కేసాని ని ఘనంగా సన్మానించిన డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (జివి)

**ఖమ్మం, నేటి శుభోదయ :**
సేవా భారతి ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన డా. కేసాని మారుతి బాబురావుకు ఘన సన్మానం జరిగింది. బుధవారం డా. గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జి వి ), మోత్కూరి నారాయణరావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సేవా భారతి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన శ్రీ సహస్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరో సర్జన్ డా. కేసాని మారుతి బాబురావు ని పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.ఈ సందర్భంగా శ్రీరక్ష హాస్పిటల్ అధినేత, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జి వి), సేవా భారతి ఖమ్మం జిల్లా విహెచ్‌పి సేవా సమితి చైర్మన్ మోత్కూరి నారాయణరావు తో కలిసి డా. మారుతి బాబురావు ని వారి కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా భారతి సమాజ సేవ, విద్య, వైద్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక కార్యక్రమాల ద్వారా విశేష సేవలు అందిస్తున్న సంస్థ అని పేర్కొన్నారు. డా. కేసాని మారుతి బాబురావు నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో సేవా భారతి కార్యక్రమాలు మరింత విస్తృతమై సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.





# ప్రతి ఓటరు సర్ లో వివరాలు నమోదు చేసుకోవాలి
## - గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్

**కేశంపేట, నేటి శుభోదయ :**
కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత శాతం నమోదు పూర్తయిందనే వివరాలను బీఎల్ఓలు, గ్రామ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నమోదు ప్రక్రియ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఇంకా నమోదు చేసుకోని అర్హులైన ఓటర్లను గుర్తించి వారి వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని సూచించారు.గ్రామంలోని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ లో తమ వివరాలను నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని బీఎల్ఓలు, గ్రామ సిబ్బందికి సర్పంచ్ సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని అవసరమైన పత్రాలపై సమాచారం అందించి, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని కోరారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ



ఓటరు వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు పూర్తి చేసుకోవాలని సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మైలార్దేవురుపల్లి డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :**
మైలార్దేవురుపల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నూతనంగా చేపడుతున్న పలు మౌలిక సదుపాయాలు,అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ,పార్కుల సుందరీకరణ పనుల పురోగతిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన..నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులకు సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని,ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హెచ్ఎండిఏ అధికారులను,సంబంధిత కాంట్రాక్టర్లను ఆయన కఠినంగా ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను,ప్రతి కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా ప్రథమ లక్ష్యం.ప్రజలకు మెరుగైన,నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది.హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసమే హెచ్ఎండిఏ ప్రత్యేక నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.భవిష్యత్తులోనూ ప్రజల అవసరాలకు అనుగు



ణంగా మరిన్ని నిధులు మంజూ చేయిస్తాం అని పేర్కొన్నారు.కాలనీ వాసులు తమ దృష్టికి తెచ్చిన మరికొన్ని చిన్న తరహా సమస్యలను సైతం వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు.ఎమ్మెల్యే పర్యటనతో తమ కాలనీ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో హెచ్ఎండిఏ స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, హౌసింగ్ బోర్డ్ కాలనీ సంక్షేమ సంఘం (వెల్ఫేర్ అసోసియేషన్) సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పర్యవేక్షించిన ఎమ్మెల్సీ రవీందర్

**ఏన్కూర్, నేటి శుభోదయ :**
ఏన్కూర్ మండల పరిధిలోని టీ.ఎల్.పేట గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పర్యవేక్షించారు. వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.జే.సీ. కృష్ణ, జిల్లా సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జున, నాయకులు గిరిబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఎల్ఓలతో సమావేశమైన ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏన్కూర్ మండలం సీనియర్ నాయకులు యండార్తి మోహన్‌రావు, గిద్దగిరి సత్యనారాయణ, తిమ్మరావుపేట సర్పంచ్ గుగులోత్ సుమలత, టీ.ఎల్.పేట సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, ఉపసర్పంచ్ నామా వెంకయ్య, బీఎల్ఏ ఎస్‌కే ఖాసీం, గడం వెంకటేశ్వర్లు, పూర్ణకంటి నాగరాజు, మాదేని సాయి, భూక్య శివ,



కోనపల్లి నరేష్, చల్లా కోటేశ్వరరావు, ఉపేందర్, బారపాటి వెంకటనారాయణ, లక్ష్మయ్య, రవి, భూక్య ధర్మా, కడియాల సుధాకర్, వినోద్, బాబూలాల్, జరపాల లింగ, అరెం కోటేష్, వాకడోత్ లక్ష్మణ్ నాయక్, ధారావత్ కృష్ణ, యేసుబాబు, రామస్వామి, ఇంజం దేవదాస్, నజీర్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లి గ్రామ నూతన పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



**కేశంపేట, నేటి శుభోదయ :**
రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి నూతనంగా నియమితులైన గ్రామపంచాయతీ కార్యదర్శిని యువనాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్, డిప్యూటీ సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు వెంకట్రామ్ రెడ్డి, సుల్తాన్ పాషా, మాధవ్, అరవింద్ పాల్గొని నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువకులు దశరథ్, ఉదయ్ గౌడ్, మంగలి మహేష్, రవి గౌడ్ తదితరులు హాజరై పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. గ్రామాభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# గ్రామపంచాయతీ నిర్ణయాలపై దౌర్జన్యం చేస్తే ఊరుకోం





**నిజామాబాద్, నేటి శుభోదయ :**
గ్రామంలో అభివృద్ధి పనులను అడ్డుకునేలా కొందరు వ్యక్తులు వీడిసి పేరిట దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదని నందిపేట గ్రామ సర్పంచ్ ఎర్రం సిలిండర్ లింగం హెచ్చరించారు.గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన మహిళా సంఘ భవన నిర్మాణంకు తవ్విన పునాది గుంతలను కొందరు అసాంఘిక వ్యక్తులు దౌర్జన్యంగా పూడ్చివేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు.నందిపేట పాలకమండలి సభ్యులతో కలిసి పుడిచివేసిన గుంతలను పరిశీలించి,అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఆడపడుచులకు ఇచ్చిన హామీ మేరకు గ్రామ నడిబొడ్డున సమావేశ మందిరం నిర్మిస్తామంటే అడ్డుకోవడం అవివేకం అన్నారు.ఇప్పటికి రెండుసార్లు నిర్మాణ పనులను అడ్డుకొని పునాది గుంతలను పూడ్చివేయడం పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతితో వార్డు సభ్యులందరి ఏకగ్రీవ తీర్మానంతో ప్రభుత్వ స్థలంలో ఈ పనులు చేపడుతున్నామని చెప్పారు.ఇక్కడ వీడీసీకి భవనం కడతామని,ప్రకృతి వనం ఉందని అబద్ధపు మాటలతో ప్రజలను,అధికారులను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.కనీసం వార్డు సభ్యుడిగా గెలవలేని వ్యక్తులు రాజకీయంగా తమను అప్రతిష్ట పాలు చేసేలా అమాయకులను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వాన్ని ప్రస్తుత పాలకమండలి పరిపాలనను అపఖ్యాతి చేయాలని ఉద్దేశంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆక్షేపించారు.తమ పాలకవర్గం పూర్తిగా మహిళా సాధికారికతకు కట్టుబడి ఉందని ఎవరు ఎన్ని అడ్డంకులు కలిగించిన గ్రామంలో మహిళా సమావేశం భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ చందర్,వార్డు సభ్యులు,నాయకులు నరేష్,పెట్ల శ్రీనివాస్,అన్వేష్ గౌడ్,పాషా,జోర్పూర్ ఇమ్రాన్,కొత్తూరు భాస్కర్,వినీత్ పాల్గొన్నారు.

నేటి శుభోదయ
గురువారం | హైదరాబాద్
16 - 07 - 2026
www.netisubhodaya.com



## పాటల ద్వారా వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన



**హనుమకొండ, నేటి శుభోదయ :** హనుమకొండ వాజ్‌పేయి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, గేయాలు, ప్రేరణాత్మక సందేశాల ద్వారా బాల బాలికలకు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గాయకుడు మిరియాల రత్నం, విశ్రాంత ఇంజనీర్ పెండ్లి ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి పాటలు పాడారు. ఈ సందర్భంగా విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రేరణాత్మక సందేశాలు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని పాటలు పాడుతూ సందేశాలను ఆసక్తిగా ఆలకించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో సానుకూల ఆలోచనలు, మంచి విలువలను పెంపొందించడంలో దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు.. ప్రజల సహకారం కోరిన పోలీసులు



**ఏటూరునాగారం, నేటి శుభోదయ :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మల్యాల గ్రామానికి చెందిన రేగ శిరీష (28) అనే మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం, కొండాయి గ్రామంలో నివాసముంటున్న రేగ శిరీష ఈ ఏడాది జూన్ 12న సాయంత్రం 7 గంటల సమయంలో బాత్రూమ్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త రేగ విజయ్‌కుమార్ ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు ఏటూరునాగారం ఎస్ఐ మహేష్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రేగ శిరీష ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా ఏటూరునాగారం పోలీసులను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.——— సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:★ సీఐ, ఏటూరునాగారం: 8712670113★ ఎస్ఐ, ఏటూరునాగారం: 8712670090★ పోలీస్ స్టేషన్, ఏటూరునాగారం: 8712670091

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో కృష్ణవేణి



**ములుగు జిల్లా నేటి శుభోదయ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ–2026 కార్యక్రమంలో భాగంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీతో పాటు బండారుపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆమె, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్, మెప్మా ఏడీఎంసీ వహీదా తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు మున్సిపాలిటీ 1వ వార్డులో ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం,



**షాద్ నగర్, నేటి శుభోదయ :** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా బీఎల్ఏ పీర్లగూడెం మహేష్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు వెంటనే ఈఎఫ్ ఫారాలు నింపి సంబంధిత బీఎల్వో కు అందజేయాలని కోరారుఈ బూతులో మొత్తం 1,000 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 643 మంది ఓటర్ల వెరిఫికేషన్ పూర్తయిందని ఇంకా 355 మంది వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉందని తెలిపారు అలాగే మరణించిన ఇద్దరు ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడినట్లు వెల్లడించారుమిగిలిన అర్హులైన ఓటర్లు ఆలస్యం చేయకుండా ఫారాలు నింపి సమర్పించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు రాజు,బండారి లక్ష్మీనారాయణ,చిటికల నారాయణ, చిటికల నర్సింహ,బండారి శ్రీనుతో పాటు వార్డు గ్రామస్థులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### - 28వ డివిజన్ లో పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్...



**నిజామాబాద్, నేటి శుభోదయ :** స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్)ప్రక్రియ వేగవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.నగరంలోని 28వ డివిజన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.కావున ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.ప్రధానంగా ఎన్యుమరేషన్ పత్రాలను పూర్తిచేసి సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలన్నారు.అనేకమందికి ఎనిమరేషన్ ఫామ్ నింపడంలో గందరగోళం ఏర్పడుతుందని,కావున ఓటర్లకు బిఎల్వోలు,పార్టీ బీఎల్ఎ లు సహకరించాలని సూచించారు.కార్పోరేటర్లు సైతం తమ పరిధిలోని ఓటర్లకు తగు సూచనలు చేస్తూ ఎన్యుమరేషన్ ఫామ్ లను నింపి తిరిగి ఇచ్చేలా చూడాలన్నారు. ఎస్ఐఆర్ గడువు పెంపు...కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ గడుపును ఈ నెల 24 నుంచి ఆగస్టు 3వ తేదీకి పొడిగించిందని ఎమ్మెల్యే తెలిపారు.కావున నగరంలోని ఓటర్లందరూ గమనించి నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ పత్రాలను సంబంధిత బి ఎల్ ఓ లకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీల విడుదలకై 17న "ఇందూర్ రణభేరి"

### - బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి



**నిజామాబాద్, నేటి శుభోదయ :** బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ,ఈ నెల 17 శుక్రవారం ఉదయం ధర్నా చౌక్ వద్ద "ఇందూర్ రణభేరి"కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ఇందూర్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి,ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లపైనే ఆధారపడి చదువుకుంటున్నారు.ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం రూ.11,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వల్ల ప్రతి ఏటా రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.సుమారు 4.5 లక్షల మంది విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ దుస్థితి వల్ల మన రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే దుస్థితి దాపురించింది.మూసీ ప్రక్షాళన,ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులకు వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం,పేద విద్యార్థుల విద్యావకాశాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది.స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా,గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెలా ఫీజులు చెల్లిస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగారుస్తూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడం దారుణమని మండిపడ్డారు.ఈ "ఇందూర్ రణభేరి" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులు,విద్యార్థి సంఘాల నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాలొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతంకర్ లక్ష్మి నారాయణ,నాగోల్ల లక్ష్మి నారాయణ,బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కో కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ,కార్పొరేటర్ శ్రవణ్,బీజేపీ ఐటీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్,బీజేపీ నాయకులు అంబదాస్ రావు,యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ గౌడ్,విపుల్ రావు,రాజ్ గణేష్,రాకేష్,బీజేపీ,బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి జన నాయకుడు సర్పంచ్ శేఖర్ యాదవ్

### -ఘనంగా ఉప్పల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు భోజనం



**తలకొండపల్లి, నేటి శుభోదయ :** తలకొండపల్లిలో జనం మెచ్చిన నాయకుడిగా సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్,మంచి గుర్తింపు తెచ్చుకోవడం జరుగుతుంది.బుధవారం తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ జన్మదిన సందర్భంగా ఉప్పల వెంకటేష్ ఉప్పల ఆశ్రమ పాఠశాల మరియు కళాశాల నందు 400 మంది విద్యార్థులకు (బాలికలు) భోజనం ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను ఉప్పల ఆశ్రమ పాఠశాల మరియు కళాశాల నందు చిన్నారులతో కలిసి జరుపుకోవడం నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది వారి చిరునవ్వుల్లో కనిపించిన సంతోషం వారితో కలిసి భోజనం చేస్తూ గడిపిన ఈ మధుర క్షణాలు నా జీవితంలో చిరస్మయంగా నిలిచిపోతాయి.చిన్నారులకు అవసరమైన సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు..అనంతరం కార్యకర్తల సమక్షంలో బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి శేఖర్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కార్యకర్తలు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య,వార్డు సభ్యుడు వెంకటేష్ యాదవ్,అఖిల్ మరియు ఆశ్రమ ప్రిన్సిపల్ మరియు లెక్చరర్స్ టీచర్స్,వార్డు సభ్యులు,టిఆర్ఎస్ శ్రేణులు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620